www.epaper.asthram.com

# సామాన్యుడి అస్త్రం

తెలుగు దినపత్రిక

శనివారం 27 డిసెంబర్ 2025

సంగారెడ్డి సంచిక : 173 సంపుటి : 1 పేజీలు : 8 వెల : రూ. 5/-

## ఐఫోన్ ఎస్ఈ సహా పలు మోడళ్లకు యాపిల్ గుడ్‌బై

టెక్ దిగ్గజం యాపిల్ ఈ ఏడాది అనేక రకాల స్మార్ట్‌ఫోన్ మోడళ్లతో పాటు ఐప్యాడ్, మ్యాక్, వాచ్, ఇతర డివైజ్‌లను గుడ్‌బై చెప్తోంది. థర్డ్ పార్టీ రిటైల్ స్టోర్లు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లైన ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ వంటి చోట్ల ఆయా ఫోన్లు అందుబా టులో ఉంటాయి. కానీ, స్టాక్ పూర్తయిన తర్వాత అవి కూడా మార్కెట్ల నుంచి పూర్తిగా కనుమరుగయ్యే అవకాశం ఉంటుంది. యాపిల్ సంస్థ అమ్మకాల ఉంచి తొలగించిన స్మార్ట్‌ఫోన్‌లలో ఐఫోన్ ఎస్ఈ, 14, 14 ప్లస్, 15, 15 ప్లస్, 16 ప్రో, 16 ప్రో మ్యాక్స్ ఉన్నాయి. అలాగే, ఐఫోన్ ఎస్ఈ మోడల్ ఆగిపోవడం మూలంగా టచ్ ఐడీ, హెూమ్ బటన్, స్మాల్ స్క్రీన్, ఎల్‌సీడీ డిస్‌ప్లే ఉన్న ఏ ఫోన్‌ను విక్రయించదు.



# ఆ దుష్ప్రచారాన్ని నమ్మొద్దు

## రైతుభరోసా పథకాన్ని నిలిపివేయట్లేదు

- 'తెలంగాణ రైతుభరోసా పథకం'
- రైతుభరోసా పథకం నిలిపేస్తున్నారంటూ సోషల్ మీడియాలో దుష్ప్రచారం!
- ఆ వార్తలను ఖండించిన తెలంగాణ ప్రభుత్వం
- అలాంటివి నమ్మొందంటూ ఎక్స్‌లో పోస్ట్ చేసిన తెలంగాణ ప్రభుత్వ ఫ్యాక్ట్‌చెక్ విభాగం
- నిజమైన లబ్ధిదారులకు మాత్రమే ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందేవిధంగా చూసేందుకు క్షేత్రస్థాయి వెరిఫికేషన్ నిర్వహిస్తున్నట్లుగా వెల్లడి


హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న రైతు భరోసా పథకాన్ని నిలిపివేస్తున్నారంటూ సోషల్ మీడియా వేదికగా జరుగుతోన్న ప్రచారాన్ని ప్రభుత్వం ఖండించింది. ఇందులో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేసింది. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న ఇలాంటి వార్తలు పూర్తిగా నిరాధారం, అవాస్తవం, దురుద్దేశంతో కూడినవేనని పేర్కొంటూ తెలంగాణ ప్రభుత్వానికి సంబంధించిన ఫ్యాక్ట్ చెక్ విభాగం సోషల్ మీడియా'ఎక్స్'లో పోస్టు పెట్టింది. ఆ పోస్టులో ఏముందంటే రైతు భరోసా కింద తెలంగాణలో దాదాపు 65 లక్షల మందికి పైగా అన్నదాతలు లబ్ధి పొందుతున్నారని, ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేయడంలేదని ఫ్యాక్ట్ చెక్ విభాగం పేర్కొంది. ప్రస్తుతం సంబంధిత జిల్లా కమిటీలు నిజమైన లబ్ధిదారులకు మాత్రమే ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందేవిధంగా చూసేందుకు క్షేత్రస్థాయి వెరిఫికేషన్ నిర్వహిస్తున్నట్లుగా వెల్లడించింది. అలాగే, ఆర్థిక శాఖ సైతం లబ్ధిదారులకు చెల్లింపులు చేసేం దుకు వారి జాబితాను సిద్ధం చేసి తిరిగి తనిఖీ కూడా నిర్వహిస్తోందని ఫ్యాక్ట్ చెక్ విభాగం పోస్టు చేసింది. రైతు భరోసా నిలిపివేస్తున్నారన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని పేర్కొంది. ఇది లబ్ధిదారులను తప్పుదోవ పట్టించేదిగా ఉందని ఎక్స్?లో చేసిన పోస్టులో తెలిపింది. ప్రభుత్వ ఫ్యాక్ట్ చెక్ విభాగం తెలిపిన వివరాల ప్రకారం వాణిజ్య వినియోగంలో ఉన్న భూములకు సంబంధించి రైతు భరోసా పథకం ప్రయోజనాలు పొందుతున్న వారిని - మిగతా3లో



## గడువులోగా ప్రాపర్టీ వివరాలివ్వండి

- ఏఐఎస్ ఆఫీసర్లకు కేంద్రం వార్నింగ్
- ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ ఆఫీసర్లకు కేంద్రం హెచ్చరిక
- నిర్దేశిత గడువులోగా తమ ప్రాపర్టీ వివరాలను వెల్లడించాలి
- వివరాలు పొందుపరచడంలో జాప్యం జరిగితే ప్రమోషన్లు కోల్పోయే అవకాశం ఉన్నట్లు అధికారిక ప్రకటన



## హెచ్-1బీ వీసా అంశంపై స్పందించిన భారత్

- వీసా అపాయింట్‌మెంట్‌ల షెడ్యూలింగ్ లేదా రీషెడ్యూలింగ్‌లో ఇబ్బందులు
- ఫిర్యాదులు అందినట్లు తెలిపిన రణధీర్ జైశ్వాల్
- భారత సంతతి వ్యక్తి మృతిపై కెనడా ప్రభుత్వానిదే బాధ్యత అన్న భారత్

## యాక్టివ్ మోడ్‌లోకి మళ్లీ కేసీఆర్



- కీలక నేతలతో భేటీ అయిన కేసీఆర్
- వేడెక్కుతున్న తెలంగాణ రాజకీయం
- ఫామ్ హౌస్‌లో కేటీఆర్, హరీశ్ తదితరులతో కేసీఆర్ భేటీ
- అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చ
- ఫోన్ ట్యాంపింగ్ అంశంపై కూడా చర్చ జరిగినట్లు సమాచారం

## ఢిల్లీలో కాలుష్య సంక్షోభానికి వాళ్లే పరిష్కారం కనుగొంటారు

- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్
- 'ఢిల్లీని పీడిస్తున్న వాయు కాలుష్య సమస్యను నివారించడానికి స్వల్పకాలిక ఉపశమనం కలిగించే విధానాల కంటే.. దీర్ఘకాలిక పరిష్కారం కోసం చర్యలు అవసరం.
- ప్రజారోగ్యానికి పెద్ద సవాలుగా మారుతున్న ఈ వాయు కాలుష్య సమస్యకు నిపుణులు పరిష్కారం కనుగొంటారని నాకు నమ్మకం ఉంది'



## 28న గ్రామగ్రామాన కాంగ్రెస్ నిరసనలు

- ఇది వరకే ఈ పేరు తొలగింపుపై పలు జిల్లాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఈ కార్యక్రమాన్ని గ్రామ గ్రామాన నిర్వహించాలని యోచిస్తుంది
- ఈ పథకం గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన వారికి 125 రోజుల పాటు పనిని కల్పిస్తుంది
- అయితే ఈ పథకంలో మహాత్మాగాంధీ పేరును తొలగించడాన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా తప్పుబడుతున్నాయి.

హైదరాబాద్

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్చడంపై కాంగ్రెస్ రాష్ట్రంలో నిరసనలు తీవ్రతరం చేస్తోంది. ఇది వరకే ఈ పేరు తొలగింపుపై పలు జిల్లాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఈ కార్యక్రమాన్ని గ్రామ గ్రామాన నిర్వహించాలని యోచిస్తుంది. ఈ నెల 28న ప్రతి గ్రామంలో గాంధీ చిత్రపటాలతో ఆందోళనలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు - మిగతా3లో





## వినియోగదారుల భద్రతే లక్ష్యం

- అగరుబత్తీలపై కేంద్రం కొత్త ప్రమాణాలు...
- అగరుబత్తీల తయారీలో కీలక మార్పులు
- బీఐఎస్ కొత్త ప్రమాణాలు విడుదల
- పలు హానికర రసాయనాలు, సువాసనల వాడకంపై నిషేధం
- నాణ్యమైన ఉత్పత్తులకు బీఐఎస్ స్టాండర్డ్ మార్క్
- భారత ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్‌లో పెరగనున్న ఆదరణ

# బీజేపీ ప్రత్యేక వ్యూహం!

- వచ్చే ఎన్నికల కోసం బీజేపీ పక్కా ప్లాన్ ప్రకారం ముందుకు సాగుతోంది
- రాష్ట్రంలో బీజేపీని బలపరిచేందుకు రంగంలోకి ఆర్ఆర్ఎస్
- ఆర్ఎస్ఎస్‌కు బీఎంఎస్ అనుబంధ సంస్థగా కొనసాగుతోంది
- నగర శివారులోని కన్హా శాంతి వనంలో విశ్వ సేవక్ సంఘ్ శిబిరం గత మూడు రోజులుగా కొనసాగుతోంది
- ఇక, బీజేపీ బలోపేతంలో భాగంగా ఇప్పటికే రాష్ట్రంలో ఆర్ఎస్ఎస్ శాఖల పెంపు, కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయి



తెలంగాణలో వచ్చే ఎన్నికల కోసం బీజేపీ పక్కా ప్లాన్ ప్రకారం ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో బీజేపీని బలపరిచేందుకు ఆర్ఆర్ఎస్ రంగంలోకి దిగింది. నేడు ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ హైదరాబాద్‌లో పర్యటించనున్నారు. మరోవైపు, గురువారం హైదరాబాద్‌లో బీఎంఎస్ (భారతీయ మజ్దూర్ సంఘ్) కార్యాలయాన్ని సర్ కార్యవాహ దత్తాత్రేయ హోసబలె ప్రారంభించారు. ఆర్ఎస్ఎస్‌కు బీఎంఎస్ అనుబంధ సంస్థగా కొనసాగుతోంది. కాగా, తెలంగాణలో ఆర్ఎస్ఎస్ ప్రముఖుల పర్యటనలు ఆసక్తి రేపుతున్నాయి. నగర శివారులోని కన్హా శాంతి వనంలో విశ్వ సేవక్ సంఘ్ శిబిరం గత మూడు రోజులుగా కొనసాగుతోంది. ఈ శిబిరం ముగింపు కార్యక్రమానికి ఆర్ఎస్ఎస్ చీఫ్ - మిగతా3లో




## ఎయిర్ ప్యూరిఫైయర్లపై జీఎస్టీ తగ్గింపు.. కేంద్రం స్పందన ఇదే

ఎయిర్ ప్యూరిఫైయర్లపై 18 శాతం జీఎస్టీ కొనసాగిస్తుండటంపై ఢిల్లీ హైకోర్టు ఆగ్రహం

జీఎస్టీ రేట్లను సరైన ప్రక్రియ తర్వాత జీఎస్టీ కౌన్సిల్ మాత్రమే నిర్ణయించగలదు

అలాగే, ఈ పిటిషన్‌పై స్పందించడానికి రెండు రోజుల సమయం సరిపోదు

# ఎయిర్ ప్యూరిఫైయర్లపై జీఎస్టీ తగ్గింపు.. కేంద్రం స్పందన ఇదే..




ఢిల్లీ: దేశ రాజధాని నగరం ఢిల్లీ సహా చుట్టుపక్కల పలు ప్రాంతాల్లో వాయు కాలుష్యం తీవ్రంగా ఉన్న వేళ.. ఎయిర్ ప్యూరిఫైయర్లపై 18 శాతం జీఎస్టీ కొనసాగిస్తుండటంపై ఢిల్లీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో కేంద్రం తరఫున విచారణకు విచారణకు హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) వెంకటరమణ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎయిర్ ప్యూరిఫైయర్లపై దాఖలైన పిల్‌ను వ్యతిరేకించారు. దీనిపై వివరణాత్మక అఫిడవిట్ దాఖలుకు సమయం ఇవ్వాలని కోరారు. ఎయిర్ ప్యూరిఫైయర్లను వైద్య పరికరంగా పరిగణించి.. 5 శాతం జీఎస్టీ శ్లాబులోకి తీసుకొచ్చేలా ఆదేశాలివ్వాలని కోరుతూ ఢిల్లీ కోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైన విషయం తెలిసిందే. న్యాయవాది కపిల్ మదన్ దాఖలు చేసిన ఈ పిటిషనుపై కేంద్రానికి హైకోర్టు నోటీసు జారీ చేసింది. ఈ నేపథ్యంలో కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ వెంకటరమణ శుక్రవారం వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా.. జీఎస్టీ రేట్లను సరైన ప్రక్రియ తర్వాత జీఎస్టీ కౌన్సిల్ మాత్రమే నిర్ణయించగలదు. అలాగే, ఈ పిటిషన్‌పై స్పందించడానికి రెండు రోజుల సమయం సరిపోదన్నారు.

ఈ విషయంపై వివరణాత్మక అఫిడవిట్ దాఖలు చేయడానికి పది రోజుల సమయం ఇవ్వాలని కోర్టును అభ్యర్థించారు. జీఎస్టీ తగ్గింపునకు ఒక ప్రక్రియ ఉందని, ఈ ప్రక్రియను అడ్డుకోలేమని కోర్టుకు తెలిపారు. జీఎస్టీ కౌన్సిల్ ఒక రాజ్యాంగబద్ధమైన సంస్థ అని, ఇది సమాఖ్య పన్ను అని వివరించారు. ఈ ప్రక్రియలో అన్ని రాష్ట్రాలు పాలుపంచుకుంటాయని, ఏదైనా విషయంపై ఓటింగ్ జరగాలంటే అది భౌతికంగా మాత్రమే సాధ్యమవుతుందన్నారు. పార్లమెంటరీ కమిటీ మాకు కొన్ని సిఫార్సులు చేసింది. వాటిని పరిగణనలోకి తీసుకుంటాము. ఇందులో రాజ్యాంగపరమైన అంశం ముడిపడి ఉందని చెప్పుకొచ్చారు. దీంతో, తదుపరి విచారణను జనవరి 9వ తేదీకి కోర్టు వాయిదా వేసింది.

**చనిపోతున్నా స్పందించరా?**

అంతకుముందు.. దేశ రాజధాని నగరం ఢిల్లీ సహా చుట్టుపక్కల పలు ప్రాంతాల్లో వాయు కాలుష్యం తీవ్రంగా ఉన్న వేళ.. ఎయిర్ ప్యూరిఫైయర్లపై 18 శాతం జీఎస్టీ కొనసాగిస్తుండటంపై హైకోర్టు బుధవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లోనూ గాలి శుద్ధి యంత్రాలపై జీఎస్టీ తగ్గించే అంశాన్ని ఎందుకు పరిశీలించడం లేదని కేంద్రాన్ని ప్రశ్నిస్తూ.. దీనిపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. జీఎస్టీ కౌన్సిలు తక్షణం సమావేశమై గాలిశుద్ధి యంత్రాలపై పన్ను తగ్గించడం లేదా పూర్తిగా రద్దు చేయడంపై ఓ నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. “మనం రోజుకు 21 వేల సార్లు శ్వాస తీసుకుంటాం. అలాంటప్పుడు గాలి కాలుష్యం వల్ల ఎంత నష్టం జరుగుతుందో ఓసారి లెక్కించండి” అని వ్యాఖ్యానించింది. పిటిషనుపై స్పందించేందుకు గడువు ఇవ్వాలన్న ప్రభుత్వ అభ్యర్థనపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. “వాయు కాలుష్యం ప్రాణాంతకంగా మారింది. వేల సంఖ్యలో ప్రజలు చనిపోయిన తర్వాత స్పందిస్తారా? ప్రతి పౌరుడికి స్వచ్ఛమైన గాలి అవసరం. అది అందించలేనప్పుడు కనీసం శుద్ధి యంత్రాలనైనా అందుబాటు ధరల్లో ఉంచాలి కదా! ఇలాంటి ఎయిర్ ఎమర్జెన్సీలో జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ) కింద తాత్కాలిక పన్ను మినహాయింపును తక్షణం ఎందుకు ఇవ్వకూడదు?” అని కేంద్రంపై ప్రశ్నలు కురిపించింది. ప్రజల ప్రాణాల కంటే పన్నులే ముఖ్యమా? అంటూ ప్రశ్నించింది.

# ఢిల్లీలో కాలుష్య సంక్షోభానికి వాళ్లే పరిష్కారం కనుగొంటారు





దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం రోజురోజుకూ పెరుగుతోంది. శుక్రవారం ఉదయం కూడా గాలి నాణ్యత సూచిక ప్రమాదకర స్థాయిలో నమోదైంది. అనేక ప్రాంతాల్లో ఏక్యూఐ లెవెల్స్ 400కిపైగా నమోదయ్యాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో రాజధాని నగరంలో తీవ్ర కాలుష్యంపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కాలుష్య సంక్షోభానికి పర్యావరణ నిపుణులు సమర్థవంతమైన పరిష్కారాన్ని కొనుగొంటారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఓ న్యూస్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ మాట్లాడుతూ.. ‘ఢిల్లీని పీడిస్తున్న వాయు కాలుష్య సమస్యను నివారించడానికి స్వల్పకాలిక ఉపశమనం కలిగించే విధానాల కంటే.. దీర్ఘకాలిక పరిష్కారం కోసం చర్యలు అవసరం. ప్రజారోగ్యానికి పెద్ద సవాలుగా మారుతున్న ఈ వాయు కాలుష్య సమస్యకు నిపుణులు పరిష్కారం కనుగొంటారని నాకు నమ్మకం ఉంది’ అని అన్నారు. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రకారం.. శుక్రవారం ఉదయం రాజధాని నగరంలో గాలి నాణ్యత గణనీయంగా క్షీణించింది. ఉదయం 8 గంటల ప్రాంతంలో నగరంలో ఓవరాల్ ఏక్యూఐ లెవెల్స్ 305గా నమోదైంది. అత్యధికంగా ఆనంద్ విహార్ ప్రాంతంలో గాలి నాణ్యత సూచిక 390గా నమోదైంది. బవానాలో 379, నరేలా ప్రాంతంలో 356, ఆర్కే పురంలో 320గా ఏక్యూఐ నమోదైంది. నగరంలోని మరికొన్ని ప్రాంతాల్లో గాలి నాణ్యత మెరుగ్గా నమోదైంది. చీ౹ఖ ద్వారకలో 253, అరబిందో మార్గ్ (258), మందిర్ మార్గ్ (234), ×+× విమానాశ్రయం ౹3 (239)గా గాలి నాణ్యత నమోదైంది.

# కేరళలో చరిత్ర సృష్టించిన బీజేపీ, తిరువనంతపురం మేయర్‌గా వీవీ రాజేశ్





**తిరువనంతపురం:** కేరళలో బీజేపీ చరిత్ర సృష్టించింది. తిరువనంతపురం మేయర్‌గా బీజేపీ నేత వీవీ రాజేశ్ ఇవాళ ప్రమాణ స్వీకారం చేశారు. మేయర్‌గా ఎన్నికైన తర్వాత రాజేశ్ మాట్లాడుతూ కలిసికట్టుగా ముందుకు వెళ్తామన్నారు. అన్ని 101 వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. ఓ అభివృద్ధి చెందిన నగరంగా తిరువనంతపురం మారుతుందన్నారు. ఇది చరిత్రాత్మక సందర్భం అని, ఇది కేరళ రాజకీయాల్లో మార్పు తెస్తుందని, తిరువనంతపురంలో జరిగిన మార్పు.. యావత్ రాష్ట్రాన్ని మార్చేస్తుందని భావిస్తున్నట్లు చెప్పారు. కేరళలో బీజేపీ ప్రాబల్యం తక్కువే. బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న వీవీ రాజేశ్.. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కొడుంగనూరు వార్డు కౌన్సిలర్‌గా గెలిచారు. ఆ విక్టరీతో ఇప్పుడు ఆయన తిరువనంతపురం మేయర్‌గా మారారు. మరో ఆరు నెలల్లో కేరళలో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రాజేశ్‌కు కీలక బాధ్యతలు దక్కాయి. 2016లో నీమమ్ సీటు నుంచి బీజేపీ అభ్యర్థిగా రాజాగోపాల్ గెలిచారు. ఆ తర్వాత 2024లో త్రిసూరు నుంచి సురేశ్ గోపి విజయం సాధించారు. మేయర్ రేసులో రాజేశ్‌కు 51 ఓట్లు పడ్డాయి. తిరువనంతపురం మున్సిపాల్టీలో మొత్తం 100 మంది సభ్యులు ఉన్నారు. సీపీఎంకు చెందిన ఆర్పీ శివాజీకి 29, కాంగ్రెస్ అభ్యర్థి కేఎస్ శబరినాథన్‌కు 19 ఓట్లు పోలయ్యాయి. ఓ ఇండిపెండెంట్ అభ్యర్థి గైర్హాజరు అయ్యారు. రెండో స్వతంత్ర్య కౌన్సిలర్ పీ రాధాకృష్ణన్ ఓటు విజయంలో కీలకంగా మారింది. డిసెంబర్ 9వ తేదీన జరిగిన వార్డు ఎన్నికల్లో బీజేపీకి 50 సీట్లు దక్కాయి.

# విద్యార్థి పెన్ను దొంగిలించినట్లు ఆరోపణ.. వేధిస్తున్న స్కూల్ ప్రిన్సిపాల్, టీచర్లపై కేసు



**లక్నో:** ఒక విద్యార్థి పెన్ను దొంగిలించినట్లు స్కూల్ సిబ్బంది ఆరోపించారు. ఆ బాలుడ్ని వారు వేధిస్తుండటంతో అతడు భరించలేకపోయాడు. కుమారుడి ప్రవర్తనలో మార్పు గమనించిన తల్లిదండ్రులు ఆందోళన చెందారు. స్కూల్ వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. (ఝుతీఝుంంఅఅస్త్ర హ్బసవత్ ాజవతీ ాావఅ ంష్ట్రవట్) ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ఈ సంఘటన జరిగింది. ఒక ప్రైవేట్ స్కూల్‌లో 8 ఏళ్ల బాలుడు రెండో తరగతి చదువుతున్నాడు. నవంబర్ 28న ఒక స్టూడెంట్ పెన్ను చోరీ అయ్యింది. అయితే ఆ బాలుడు దొంగిలించినట్లు స్కూల్ సిబ్బంది ఆరోపించారు. డిసెంబర్ 12న ప్రిన్సిపాల్ రూమ్‌కు అతడ్ని పిలిపించారు. పెన్ను దొంగిలించినట్లు ఆ విద్యార్థితో బలవంతంగా ఒప్పించి వీడియో రికార్డ్ చేశారు. చోరీ అయిన పెన్ను ధర చెల్లించాలని బాలుడి పేరెంట్స్‌ను ఒత్తిడి చేశారు. కాగా, పెన్ను చోరీ జరిగిన రోజున తమ కుమారుడు స్కూల్‌కు వెళ్లలేదని తల్లిదండ్రులు తెలిపారు. ఆ తప్పు చేసినట్లుగా బలవంతంగా ఒప్పించి రికార్డ్ చేశారని ఆరోపించారు. నాటి నుంచి స్కూల్ సిబ్బంది తమ కుమారుడ్ని వేధిస్తున్నారని విమర్శించారు. రాత్రివేళ నిద్ర లేచి ఏడుస్తున్నాడని, ‘మేడం నేను పెన్ను తీయలేదు’ అని కలవరిస్తున్నాడని తెలిపారు. బుక్స్‌తో పాటు గోడలపై ‘హెల్ప్’ అని రాయడాన్ని తాము గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరోవైపు బాలుడి తల్లి ఫిర్యాదుపై పోలీసులు స్పందించారు. ఆ స్కూల్‌కు నోటీస్ జారీ చేశారు. అయితే పోలీస్ స్టేషన్‌కు హాజరుకాలేదని పోలీస్ అధికారి తెలిపారు. ఈ నేపథ్యంలో డిసెంబర్ 23న స్కూల్ డైరెక్టర్ దేవరాజ్ సింగ్ రాజవత్, ప్రిన్సిపాల్ అనుప్రీత్ రావల్, టీచర్లు సంగీతా మాలిక్, స్వతంత్ర అగ్నిహోత్రిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

## గడువులోగా ప్రాపర్టీ వివరాలివ్వండి



**న్యూఢిల్లీ:** ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ ఆఫీసర్లకు .. ఇవాళ కేంద్రం హెచ్చరిక చేసింది. నిర్దేశిత గడువులోగా తమ ప్రాపర్టీ వివరాలను వెల్లడించాలని, లేదంటే క్రమశిక్షణా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని కేంద్రం తన ఆదేశాల్లో తెలిపింది. వివరాలు పొందుపరచడంలో జాప్యం జరిగితే ప్రమోషన్లు కోల్పోయే అవకాశం ఉన్నట్లు అధికారిక ప్రకటనలో ప్రభుత్వం పేర్కొన్నది. వార్షిక స్థిరాస్తి వివరాలను వచ్చే ఏడాది జనవరి 31వ తేదీలోగా వెల్లడించాలని ఐఏఎస్ ఆఫీసర్లకు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. పే నిబంధనలు వర్తించాలంటే ఐపీఆర్ ఫైలింగ్ తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం తన ఆదేశాల్లో తెలిపింది. పర్సనల్ అండ్ ట్రైనింగ్ శాఖ (డీఓపీటీ) .. జనవరి 2017 నుంచి ఐఏఎస్ ఆఫీసర్ల కోసం ఆన్‌లైన్ ఐపీఆర్ ఫైలింగ్‌కు అవకాశం కల్పించింది. స్పారో మాడ్యూల్‌లో ఆ ప్రక్రియ చేపట్టారు. అయితే జనవరి 31వ తేదీన ఆన్‌లైన్ మాడ్యూల్ ముగిసిపోతుందని, ఐఏఎస్‌లు అందరూ నిర్దేశిత గడువులోగా తమ ఐపీఆర్ ఫైల్ చేయాలని అన్ని రాష్ట్రాల సెక్రటరీలు, చీఫ్ సెక్రటరీలకు ఆదేశాలు జారీ చేశారు.

## వినియోగదారుల భద్రతే లక్ష్యం



దేశంలో అగరుబత్తీల (ధూప్ స్టిక్స్) నాణ్యత, భద్రతను పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వినియోగదారుల ఆరోగ్యం, పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకుని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) కొత్త ప్రమాణాలను విడుదల చేసింది. ‘జాతీయ వినియోగదారుల దినోత్సవం 2025’ సందర్భంగా శుక్రవారం కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి “ఐఎస్ 19412:2025 – అగరుబత్తీల స్పెసిఫికేషన్” పేరుతో ఈ నూతన ప్రమాణాలను ఆవిష్కరించారు. ఈ కొత్త నిబంధనల ప్రకారం, అగరుబత్తీల తయారీలో పలు హానికరమైన పురుగుమందులు, సింథటిక్ సువాసనల వాడకాన్ని పూర్తిగా నిషేధించారు. అలత్రిన్, పెర్మెత్రిన్, సైపర్‌మె త్రిన్, డెల్టామెత్రిన్, ఫిప్రోనిల్ వంటి పురుగుమందులతో పాటు బెంజైల్ సైనైడ్, ఇథైల్ అక్రిలేట్ వంటి రసాయనాల వాడకంపై ఆంక్షలు విధించారు. వీటిలో చాలా రసాయ నాలు మానవ ఆరోగ్యం, గాలి నాణ్యతపై తీవ్ర ప్రభావం చూపుతాయని అంతర్జాతీ యంగా నిషేధంలో ఉన్నాయి. ప్రపంచంలోనే అగరుబత్తీల ఉత్పత్తి, ఎగుమతుల్లో భారత్ అగ్రస్థానంలో ఉంది. దేశంలో ఏటా రూ. 8,000 కోట్ల పరిశ్రమ ఉండగా, సుమారు 150 దేశాలకు రూ. 1,200 కోట్ల విలువైన ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది. ఈ రంగం గ్రామీణ ప్రాంతాల్లోని ఎందరో చేతివృత్తుల వారికి, మహిళలకు ఉపాధి కల్పిస్తోంది. కొత్త ప్రమాణాల ప్రకారం అగరుబత్తీలను యంత్ర నిర్మిత, చేతితో తయారు చేసినవి, సాంప్రదాయ మసాలా రకాలుగా వర్గీకరించారు. ముడిసరుకులు, మండే విధానం, సువాసన వంటి అంశాల్లో నాణ్యతను నిర్దేశించారు. ఈ ప్రమాణాలకు అనుగు ణంగా ఉన్న ఉత్పత్తులకు ‘బీఐఎస్ స్టాండర్డ్ మార్క్’ లభిస్తుంది. దీనివల్ల వినియోగదారులు నాణ్యమైన, సురక్షితమైన ఉత్పత్తులను సులభంగా గుర్తించవచ్చని ప్రభుత్వం తెలిపింది. ఈ నిర్ణయం వినియోగదారుల నమ్మకాన్ని పెంచడంతో పాటు, భారత అగరుబత్తీలకు అంతర్జాతీయ మార్కెట్‌లో మరింత ఆదరణ లభిస్తుందని మంత్రిత్వ శాఖ పేర్కొంది.

## ‘ఆపరేషన్ సిందూర్’ సందర్భంగా సైనికులకు టీ, లస్సీ అందించిన బాలుడు.. దక్కిన బాల పురస్కార్ అవార్డు



**న్యూఢిల్లీ:** ఆపరేషన్ సిందూర్ సందర్భంగా పదేళ్ల బాలుడు తన వంతుగా సైనికులకు సేవలందించాడు. టీ, స్నాక్స్, పాలు, లస్సీ వంటివి వారికి అందజేశాడు. నాటి నుంచి ప్రశంసలు పొందిన ఆ బాలుడికి బాల పురస్కార్ అవార్డు దక్కింది. పంజాబ్ ఫిరోజ్‌పూర్ జిల్లాలోని సరిహద్దు ప్రాంతంలో నివసించే శ్రావణ్ సింగ్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్ ప్రదానం చేశారు. కాగా, బాల పురస్కార్ అవార్డు తనకు రావడం చాలా సంతోషంగా ఉన్నదని శ్రావణ్ సింగ్ తెలిపాడు. తనకు ఈ అవార్డు దక్కుతుందని ఎప్పుడూ ఊహించలేదని చెప్పాడు. ఆపరేషన్ సింధూర్ సందర్భంగా సైనికులకు చేసిన సేవల గురించి వివరించాడు. ‘పాకిస్థాన్‌పై ఆపరేషన్ సిందూర్ ప్రారంభమైనప్పుడు సైనికులు మా గ్రామానికి వచ్చారు. వారికి సేవ చేయాలని నేను అనుకున్నా. నేను రోజూ వారి కోసం పాలు, టీ, మజ్జిగ, ఐస్ తీసుకెళ్లేవాడిని’ అని మీడియాకు తెలిపాడు. మరోవైపు ఈ ఏడాది ఏప్రిల్‌లో జమ్మకశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులతో సహా 26 మందిని ఉగ్రవాదులు కాల్చి చంపారు. దీనికి ప్రతీకారంగా మే నెలలో భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. పాకిస్థాన్‌లోని ఉగ్రవాదుల శిబిరాలను ధ్వంసం చేసింది. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరుగడంతో పాకిస్థాన్ భారీ నష్టాన్ని చవిచూసింది. పాక్ కీలక ఎయిర్‌బేస్‌లు ధ్వంసం కావడంతో కాళ్లబేరానికి దిగి వచ్చింది. చివరకు కాల్పుల విరమణ ఒప్పందం చేసుకున్నది.

## హెచ్-1బీ వీసా అంశంపై స్పందించిన భారత్




అమెరికా హెచ్-1బీ వీసా అపాయింట్‌మెంట్‌ల షెడ్యూలింగ్ లేదా రీషెడ్యూలింగ్‌లో సమస్యలు ఎదురవుతున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయని భారత విదేశాంగ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ తెలిపారు. ఈ విషయాన్ని తాము అమెరికా అధికారుల దృష్టికి తీసుకువెళ్ళినట్లు ఆయన వెల్లడించారు. ఇది అమెరికా సార్వభౌమాధికార పరిధిలోని అంశమే అయినప్పటికీ, తమ ఆందోళనలను అమెరికాకు తెలియజేశామని ఆయన పేర్కొన్నారు. కెనడాలో గుండెపోటు కారణంగా భారత సంతతికి చెందిన వ్యక్తి ఇటీవల మరణించిన ఘటనపై కూడా భారత్ స్పందించింది. మృతుడు భారత సంతతికి చెందిన వ్యక్తి అయినప్పటికీ, అతనికి కెనడా పౌరసత్వం ఉందని స్పష్టం చేసింది. ఈ విషయంలో కెనడా ప్రభుత్వానిదే బాధ్యత అని పేర్కొంది. తీవ్ర ఛాతి నొప్పితో తన భర్తను ఆసుపత్రిలో చేర్పించినప్పటికీ, చికిత్స కోసం దాదాపు ఎనిమిది గంటలు వేచిచూడాల్సి వచ్చిందని, దీని కారణంగానే తన భర్త ప్రాణాలు కోల్పోయాడని మృతుడి భార్య ఆరోపించారు.

# సవాళ్లు, ప్రతి సవాళ్లు... ఇకపై ఫుల్ యాక్టీవ్‌గా పాలిటిక్స్

**మెదక్ :** ఇప్పటిదాక ఒక లెక్క. ఇక నుంచి మరో లెక్క. అడ్డగోలుగా మాట్లాడుతామ్. నోటికొచ్చినట్లు వాగుతామ్ అంటే కుదరదు. ప్రజాక్షేత్రంలోకి లాగుతాం. మీ సంగం తేంటో చూస్తామని..కాంగ్రెస్ సర్కార్‌కు వార్నింగ్ ఇచ్చారు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. కాంగ్రెస్ సర్కార్‌కు కావాల్సిన టైమ్ ఇచ్చామని..ఇక పోరు బాటే అంటూ యుద్ధం ప్రకటించారు. దాదాపు రెండేళ్ల పాటు ఎర్రవల్లి ఫామ్‌హౌజ్‌కే పరిమితమైన గులాబీ బాస్ ఇకపై ఫుల్ యాక్టీవ్‌గా పాలిటిక్స్‌లో ఉంటానని చెప్పుకొచ్చారు.రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టేందుకు సంసిద్ధం అవుతున్నారు. ఇందులో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లా ఉమ్మడి మహబూబ్ నగర్‌ను ఎంచుకున్నారు కేసీఆర్. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, కృష్ణా జలాలను ఏపీకి తరలించే కుట్ర జరుగుతోందని ఆరోపిస్తున్న కేసీఆర్.. ఆందోళనలు, సభలు, సమావేశాలకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కాంగ్రెస్ పాలన తెలంగాణకు శాపంగా మారిందని కేసీఆర్ శాపనార్థాలు పెట్టడం, హస్తం పార్టీ సర్కార్ అన్ని రంగాల్లో విఫలమైందని ఆరోపించి ఇకపై ప్రజల్లోకి వెళ్తామని యుద్ధం ప్రకటించడంతో రాజకీయం వేడెక్కింది. రెండేళ్లుగా స్తబ్దుగా ఉన్న బీఆర్ఎస్ క్యాడర్‌లో కేసీఆర్ రాక ఉత్సాహాన్ని నింపింది. ఇక పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఆశించిన దాని కంటే మెరుగైన ఫలితాలు రావడంతో..ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో ఇంకా సత్తా చాటొచ్చన్న నమ్మకం పెరిగింది.కేసీఆర్ చేసిన కామెంట్స్ అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం మధ్య డైలాగ్‌వార్‌కు దారితీశాయి. బీఆర్ఎస్, కేసీఆర్ చరిత్ర ఇక ముగిసిన కథే అంటున్నారు సీఎం రేవంత్. తాను రాజకీయాల్లో ఉన్నంతకాలం కేసీఆర్ కుటుంబం అధికారంలోకి రాదని, రానివ్వబోనని కొడంగల్ సాక్షిగా శపథం చేశారు. 2029 ఎన్నికల్లో 119 నియోజకవర్గాలకు ఎన్నికలు జరిగితే 80 సీట్లు, 153 నియోజకవర్గాలకు ఎన్నికలు జరిగితే 100కుపైగా సీట్లు గెలుచుకుంటాం..ఇది తన సవాల్ రాసిపెట్టుకోండి అంటూ గర్జించారు రేవంత్.అందుకు అనుగుణంగానే కేసీఆర్‌తో పాటు గులాబీ పార్టీ నేతల దూకుడుకు బ్రేకులు వేసేలా పథకం రచిస్తున్నారన్న చర్చ జరుగుతోంది. బీఆర్ఎస్ పాలనలో




స్కామ్‌లు జరిగాయంటూ కేసులు, విచారణలను స్పీడప్ చేస్తోంది కాంగ్రెస్ సర్కార్. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సిట్ ఆఫీసర్లు కేసీఆర్ సహా కేటీఆర్, హరీశ్‌రావులకు నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. రెండేళ్ల తర్వాత జనంలోకి వచ్చేందుకు రెడీ అవుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఇది ఇబ్బందికరంగా మారే అవకాశం ఉందన్న టాక్ వినిపిస్తోంది.కాంగ్రెస్ ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించిన కేసీఆర్‌కు.. సీఎం రేవంత్ రెడ్డి ఫోన్ ట్యాపింగ్ కేసుతో బ్రేకులు వేయబోతున్నారన్న చర్చ సాగుతోంది. అంతే కాకుండా ఈ నెల 29 నుంచి ప్రారంభవుతున్న అసెంబ్లీ సమావేశాల్లో నదీజలాలు, ప్రాజెక్టుల అంశం ప్రధానంగా చర్చకు వచ్చే అవకాశం ఉంది. కృష్ణా జలాలపై బీఆర్ఎస్ ప్రభుత్వం ఏపీతో కుదుర్చుకున్న ఒప్పందం తెలంగాణకు శాపంగా మారిందని చెప్పేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్, ఫార్ములా ఈ కారు రేస్ వంటి అంశాలను సభలో ప్రస్తావనకు తెచ్చేందుకు రేవంత్ సర్కార్ ప్లాన్ చేస్తోందట.కేసీఆర్‌కు నోటీసులు కొత్త కాదని, కాళేశ్వరం ప్రాజెక్ట్ కుంగిపోవడంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు హాజరై డీటేయిల్డ్‌గా సమాధానం ఇచ్చిన విషయాన్ని మర్చిపోవద్దంటున్నారు బీఆర్ఎస్ నేతలు. ఒకవేళ ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇస్తే ఆయన విచారణకు హాజరవుతారా లేదా అన్న అంశంపై ఇంకా స్పష్టత లేదంటున్నాయి పార్టీ వర్గాలు. ఫార్ములా ఈ కారు రేస్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రెండుసార్లు ఏసీబీ విచారణకు హాజరయ్యారు.కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతి ఇవ్వడంతో అరెస్ట్ తప్పదన్న ప్రచారం జరుగుతోంది. ఇదంతా రాజకీయ కక్ష సాధింపు చర్య అన్నది కారు పార్టీ నేతల వాదన. కేసులు విచారణలు తమను చికాకు పెడుతున్నాయన్న అసహనం బీఆర్ఎస్ వర్గాల్లో కనిపిస్తోంది. కొత్త సంవత్సరంలో ప్రజల్లోకి వెళ్లాలనుకున్న గులాబీ దళపతి కేసీఆర్ దూకుడుకు..బ్రేకులు వేసేందుకు రేవంత్ పక్కా స్కెచ్ రెడీ చేశారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. రేవంత్ గేమ్‌కు కేసీఆర్ దగ్గరున్న ప్లాన్ ఏంటో చూడాలి మరి.

# సెలవుల్లో ఉద్యోగులు... ఆఫీసుల ముందు ప్రజలు

**వరంగల్ :** పండుగొచ్చిందంటే చాలు.. రాష్ట్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు ఖాళీగా కనిపిస్తున్నాయి. పండుగకు ముందు, తర్వాత రోజు అధికారులు, సిబ్బంది సెలవు పెట్టి వెళ్తున్నారు. పండుగ సెలవు ఒక్కరోజే ఉన్నప్పటికీ, ఆఫీసులు మాత్రం రెండు, మూడు రోజుల పాటు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. సెక్రటేరియెట్ మొదలుకుని మండల ఆఫీసుల దాకా ఇదే పరిస్థితి నెలకొన్నది. పండుగ మూడ్‌లో ఉన్నతాధికారులు సైతం పట్టించుకోకపోవడంతో కిందిస్థాయి సిబ్బంది తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. దీంతో సమస్యలు చెప్పుకునేందుకు వచ్చే ప్రజలు అధికారుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తున్నది. సెక్రటేరియెట్‌లో ఫ్లోర్‌కు ఒక సెక్రటరీ అన్నట్టుగా ఐదుగురు కంటే ఎక్కువ మంది కనిపించలేదు. సీఎం రేవంత్ రెడ్డి ఐఏఎస్ అధికారులతో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించి.. విధుల్లో అలసత్వం వహించవద్దని, ప్రజలకు అందుబాటులో ఉండాలని హెచ్చరించారు. కానీ మరుసటి రోజే చాలామంది ఉన్నతాధికారులు విధులకు డుమ్మా కొట్టారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీలు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, సెక్రటరీలు వంటి అధికారులే తమ చాంబర్లలో కనిపించలేదు. మధ్యాహ్నం 3 గంటలకు సెక్రటేరి యెట్‌లో ఐదుగురు సెక్రటరీలు మాత్రమే అందుబాటులో ఉన్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇక చీఫ్ మినిస్టర్ ఆఫీసు (సీఎంవో)లోనూ ఇదే తీరు కనిపిస్తున్నది. అక్కడ ఉండే కీలకమైన కార్యదర్శులు ఆఫీసుకు ఎప్పుడు వస్తారో? ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి నెలకొంది. సీఎంతో బ్రీఫింగ్ ఉన్న సమయంలో వాళ్లు ఎలాగూ ప్రజలకు అందుబాటులో ఉండరు. కానీ మిగతా సమయాల్లో, సీఎం జిల్లాల పర్యటనకు వెళ్లిన టైమ్‌లోనూ వాళ్లు చాంబర్లలో ఉంటలేరు. ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, ఓఎస్డీ శ్రీనివాసులు మినహా మిగతా సెక్రటరీలు ఉన్నారా?లేరా? అన్నది తెలియడం లేదు. అసలు వీరు ఎవరిని కలుస్తున్నారు? ఎక్కడ ఉంటున్నారు? అన్నది అంతుచిక్కడం లేదు. ఐఏఎస్ అధికారులే ఉంటలేరని సాకుగా చూపిస్తూ అదనపు సెక్రటరీలు, జాయింట్ సెక్రటరీలు, అసిస్టెంట్ సెక్రటరీల నుంచి మొదలుకొని సెక్షన్



ఆఫీసర్లు, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ల వరకు అందరూ ఇదే బాటలో పయనిస్తున్నారు. సెక్రటేరియెట్ లెక్కనే జిల్లా, మండల కార్యాలయాల్లోనూ పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా వ్యవసాయం, రెవెన్యూ, పంచాయతీ రాజ్ వంటి కీలక శాఖల అధికారులు ఉదయం 11 గంటలు దాటినా కార్యాలయాలకు రావడం లేదు. వచ్చినా కాసేపటికే మీటింగ్ ఉందంటూ బయటకు వెళ్లిపోతున్నారు. సామాన్య ప్రజలు ఎక్కువగా వెళ్లేది మండల కార్యాలయాలకే. కానీ అక్కడ పరిస్థితి అధ్వానంగా తయారైంది. ఎమ్మార్వో, ఎంపీడీవో ఆఫీసుల్లో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పండుగ వచ్చిందంటే చాలు.. ఈ కార్యాలయాల్లో సగం మంది సిబ్బంది సెలవు పెట్టకుండానే డుమ్మా కొడుతున్నారు. దీంతో కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం, భూసమస్యల పరిష్కారం, ఇతరత్రా పనుల మీద వచ్చే జిల్లా, మండల కేంద్రాలకు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సాధారణ పనిదినాల్లో సైతం అధికారులు, ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదు. ఉదయం 10:30 గంటలకు కార్యాలయాల్లో ఉండాల్సిన సిబ్బంది.. మధ్యాహ్నం 12 గంటల వరకు కూడా రావడం లేదు. తీరా 12 గంటలకు ఆఫీసులకు చేరుకున్నా, గంట సేపు కూడా పని చేయకుండానే లంచ్ బ్రేక్ పేరుతో బయటకు వెళ్లిపోతున్నారు. తిరిగి సీట్లలోకి వచ్చేసరికి మధ్యాహ్నం 3 గంటలు దాటుతోంది. మళ్లీ సాయంత్రం 4 గంటలు అయిందంటే చాలు, బ్యాగులు సర్దుకుని ఇళ్లకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఇక ప్రభుత్వ నిబంధనల ప్రకారం రెండో శనివారం మాత్రమే సెలవు. కానీ వారాంతం వచ్చిందంటే చాలు యంత్రాంగం మొత్తం రిలాక్స్ మూడ్‌లోకి వెళ్లిపోతున్నారు. శుక్రవారం సాయంత్రం నుంచే సొంత పనుల మీద, ఊర్ల ప్రయాణాల మీద దృష్టి సారించే అధికారులు.. శనివారం కార్యాలయాల్లో సంతకం పెట్టి వెళ్లిపోతున్నారు. మధ్యాహ్నం తర్వాత ఏ ప్రభుత్వ ఆఫీసులో చూసినా పట్టుమని పదిమంది ఉద్యోగులు కూడా కనిపించని దుస్థితి నెలకొంది.

## తెలంగాణపై బీజేపీ ప్రత్యేక వ్యూహం!

-మొదటిపేజీ తరువాయి

మోహన్ భగవత్ హాజరుకానున్నారు. అయితే, తెలంగాణపై ఆర్ఎస్ఎస్, బీజేపీ ఫోకస్ పెట్టినట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగానే ప్రముఖుల పర్యటనలు ఉన్నాయనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇక, బీజేపీ బలోపేతంలో భాగంగా ఇప్పటికే రాష్ట్రంలో ఆర్ఎస్ఎస్ శాఖల పెంపు, కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయి. 2025లో 392 కొత్త శాఖలను ఆర్ఎస్ఎస్ ఏర్పాటు చేసింది. ఇప్పటి వరకు 3800 శాఖలు ఉండగా.. 2026 నాటికి 4000 శాఖల ఏర్పాటును లక్ష్యంగా పెట్టుకున్నట్టు సమాచారం. మరోవైపు.. 'భాగ్యనగర్' వంటి పేర్లతో సాంస్కృతిక పునరుద్ధరణకు ప్రయత్నిస్తోంది. ఇది రాష్ట్ర రాజకీయాల్లో, సామాజిక రంగంలో ఒక ముఖ్యమైన అంశంగా మారనుందని విశ్లేషకులు చెబుతున్నారు.

**బీఎంఎస్ ప్రారంభం..**

సర్ కార్యవాహ దత్తాత్రేయ హోసబలె గురువారం హైదరాబాద్‌లో బీఎంఎస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఎంఎస్‌ను ప్రపంచంలోనే అతిపెద్ద కార్మిక సంఘంగా అభివర్ణించారు. ఇక, ఆర్ఎస్ఎస్‌తో అనుబంధంగా కార్మిక రంగంలో ప్రత్యేక శక్తిగా బీఎంఎస్ ఎదుగుతోంది. బీఎంఎస్.. కార్మికుల హక్కులు, జాతీయ ప్రయోజనం, స్వదేశీ ఆర్థిక వ్యవస్థకు మద్దతుగా ఉంటుంది. ఇది కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తుంది. కార్మికులకు అవగాహన కార్యక్రమాలు, శిక్షణా శిబిరాలను కూడా ఏర్పాటు చేస్తోంది. కార్మికుల వేతనాలు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రతపై ఫోకస్ చేస్తుంది. అలాగే, స్వదేశీ ఉత్పత్తులకు మద్దతుగా స్వదేశీ జాగరణ కార్యక్రమాలు చేపట్టింది. ఆర్ఎస్ఎస్ మద్దతుతో బీఎంఎస్‌కు రాజకీయ, సామాజిక స్థాయిలో విస్తృత ప్రభావం ఉంది. దీంతో, తెలంగాణ కార్మిక సంఘాల విషయంలో బీఎంఎస్ కొత్త ప్రభావం చూపించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో తెలంగాణలో బీజేపీ బలోపేతంగా దిశగా ఇవన్నీ కార్యక్రమాలు జరుగుతున్నట్టు పొలిటికల్ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

## 28న గ్రామగ్రామాన కాంగ్రెస్ నిరసనలు

-మొదటిపేజీ తరువాయి

ఆదేశాలు జారీ చేసింది. ఇటీవల జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో "వీబీ–జీ–రామ్ జీ" 2025 అనే నూతన బిల్లును కేంద్రప్రభుత్వం తీసుకవచ్చింది. అయితే మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం 2006 ఫిబ్రవరి 2న అమలులోకి వచ్చింది. ఈ పథకం కింద గ్రామంలో దారిద్ర రేఖ దిగువ గల ప్రతి కుటుంబానికి తప్పనిసరిగా 100 రోజుల పని ఇచ్చేలా చట్టం చేయబడింది. 2009లో ఈ పథకానికి మహాత్మా గాంధీ పేరు జోడించబడింది. ప్రస్తుతం ఈ పథకం స్థానంలో కేంద్రం 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్' వీబీ–జీ–రామ్ జీ బిల్లుకు ఆమోదం తెలిపింది. ఈ పథకం గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన వారికి 125 రోజుల పాటు పనిని కల్పిస్తుంది. అయితే ఈ పథకంలో మహాత్మాగాంధీ పేరును తొలగించడాన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా తప్పుబడుతున్నాయి. గాంధీ పేరును తొలగించడం అంటే ఆయనను అవమానపరచడమేనని ఆందోళన చేస్తున్నాయి.

## యాక్టివ్ మోడ్‌లోకి మళ్లీ కేసీఆర్

తెలంగాణలో రాజకీయాలు మళ్లీ వేడెక్కాయి. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మళ్లీ యాక్టివ్ మోడ్‌లోకి వెళ్లారు. వరుస సమావేశాలు, నేతలతో మంతనాలు, వ్యూహాత్మక నిర్ణయాలతో ఆయన రాజకీయాల్లో దూకుడు పెంచుతున్నారు. ముఖ్యంగా శాసనసభ సమావేశాలు సమీపిస్తున్న వేళ, పార్టీని మళ్లీ పోరాటానికి సిద్ధం చేసే దిశగా కేసీఆర్ అడుగులు వేస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ ఈరోజు కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావుతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్గొండ, రంగారెడ్డి జిల్లాలకు చెందిన ముఖ్య నేతలు పాల్గొన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో పార్టీ తరఫున అనుసరించాల్సిన వ్యూహం, ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై ఎలా ఎదురుదాడి చేయాలన్న అంశాలపై కేసీఆర్ స్పష్టమైన దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. అలాగే రానున్న రోజుల్లో నిర్వహించాల్సిన బహిరంగ సభలు, నియోజకవర్గ స్థాయి కార్యక్రమాల తేదీలపై కూడా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. పార్టీ శ్రేణులు ప్రజల్లోకి మరింత బలంగా వెళ్లాలని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని కేసీఆర్ నేతలకు సూచించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, ఇదే సమయంలో మరో కీలక పరిణామం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌కు నోటీసులు జారీ చేయాలన్న దిశగా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ కేసును తుది దశకు తీసుకెళ్లాలంటే కేసీఆర్‌తో పాటు మాజీ మంత్రి హరీశ్ రావును కూడా విచారించాల్సిన అవసరం ఉందని సిట్ భావిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే కేసీఆర్, హరీశ్ రావులకు త్వరలో సమన్లు జారీ చేసి విచారణ చేపట్టాలని సిట్ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే శాసనసభ సమావేశాల సమయంలో రాజకీయ ఉద్రిక్తతలు పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో, సమావేశాలు ముగిసిన తర్వాత నోటీసులు ఇవ్వాలని నిర్ణయించినట్లు టాక్ నడుస్తోంది. ఈ మొత్తం పరిణామాల మధ్య కేసీఆర్ రాజకీయంగా వేగం పెంచడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఒకవైపు ప్రభుత్వంపై దాడికి సిద్ధమవుతూ, మరోవైపు న్యాయపరమైన సవాళ్లను ఎదుర్కొనే వ్యూహంతో ఆయన ముందుకు సాగుతున్నారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయాలు మరింత ఆసక్తికరంగా మారనున్నాయన్న సంకేతాలు ఇప్పటికే కనిపిస్తున్నాయి.

## ఆ దుష్ప్రచారాన్ని నమ్మొద్దు

-మొదటిపేజీ తరువాయి



ఆ జాబితా నుంచి తొలగించేందుకు ప్రొఫెసర్? జయశంకర్ తెలంగాణ వ్యవసాయ వర్సిటీ జర్మన్ టెక్నాలజీ సాయంతో 'శాటిలైట్ మ్యాపింగ్?'ను' నిర్వహిస్తోంది. 2024లో చేపట్టిన ఒక గ్రౌండ్ సర్వే ప్రకారం దాదాపు నాలుగు లక్షల ఎకరాల భూమి ముఖ్యంగా హైదరాబాద్ నగరం చుట్టుపక్కల, ఓఆర్ఆర్(ఔటర్ రింగు రోడ్డు), ఆర్ఆర్ఆర్ పరిధిలో వాణిజ్య వినియోగంలో ఉంది. ఈ మ్యాపింగ్ ప్రక్రియ ద్వారా ప్రతి లబ్ధిదారుడి వద్ద ఎంత భూమి సాగు విస్తీర్ణంలో ఉందనేది నిర్ధారించొచ్చు. "తెలంగాణ రాష్ట్రంలో రైతు భరోసా పథకాన్ని నిలిపివేస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదు. ఆ వార్త పూర్తిగా అవాస్తవం, నిరాధారమైనది, దురుద్దేశపూర్వకంగా దీనిని ప్రచారం చేశారు"– తెలంగాణ ప్రభుత్వ ఫ్యాక్ట్?చెక్ విభాగం ట్వీట్

**అర్హులైన వారందరికీ రైతుభరోసా**

రైతు భరోసా ప్రయోజనం పొందుతున్న భూమి రియల్ ఎస్టేట్ వెంచరా? కొండా, రోడ్డా, ఫాంహౌసా అనే విషయాన్ని ధ్రువీకరించేందుకు కూడా ఈ శాటిలైట్? మ్యాపింగ్ ఉపయోగపడుతుంది. మ్యాపింగ్ ప్రక్రియ అనేది ఫీల్డ్ డేటాను రికార్డులతో ధ్రువీకరించేందుకు మాత్రమే. రైతు భరోసా పథకం కింద గతేడాది దాదాపు రూ.8,500 కోట్ల నుంచి రూ.9వేల కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశాం. ఈ పథకం విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి షరతులను విధించలేదు. రైతులు రబీ/ఖరీఫ్ కాలాల్లో ఆయా పంటలు పండించవచ్చు. అలాంటి వారు కూడా ఈ రైతుభరోసాకు అర్హులే. ఒక సీజన్‌లో ఒకే పంట పండించిన రైతులకు కూడా ఆర్థిక సహాయం అందిస్తున్నాం. అర్హులైన వారికి రెండు సీజన్లకు ఎకరానికి రూ.12 వేలు చొప్పున అందుతుంది.

**అభ్యంతరాలుంటే ఇలా చేయండి**

ఒకవేళ జాబితా నుంచి పేర్లు తొలగించినా, అభ్యంతరాలు ఏమైనా ఉన్నా వివరణ కోసం రైతులు జిల్లా కలెక్టర్, జిల్లా స్థాయి రెవెన్యూ(డీఆర్వో) అధికారులను సంప్రదించవచ్చు. గతేడాది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం 90 రోజుల వ్యవధిలో పూర్తి చేయాల్సిన రైతు భరోసా నగదు పంపిణీ కార్యక్రమాన్ని కేవలం 9 రోజుల్లోనే పూర్తి చేసి రికార్డు సృష్టించింది. నిజమైన లబ్దిదారులకు నష్టం జరగకుండా ఉండేవిధంగా చూడాలని సీఎం ఆదేశించారు. ప్రజలు ఎవరూ రైతు భరోసాపై దుష్ప్రచారాలు, అసత్య వార్తలను నమ్మొద్దని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. అర్హులైన వారందరికీ రైతుభరోసా అందుతుందని స్పష్టం చేసింది.

# ముక్కోటి ఏకాదశి కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆహ్వానం

**సామాన్యుడి అస్త్రం ఇల్లందకుంట:** ఆహ్వాన పత్రిక అందించిన ఆలయ చైర్మన్ గింగిలే రామారావు ఇల్లందకుంట మండలంలోని ప్రసిద్ధ శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఈ నెల 30వ తేదీన వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని నిర్వహించనున్న ముక్కోటి ఏకాదశి మహోత్సవ కార్యక్రమానికి రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారిని ఆలయ చైర్మన్ గింగిలే రామారావు గారు మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బుధవారం హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంత్రివర్యులను కలిసిన ఆలయ చైర్మన్ గింగిలే రామారావు గారు శాలువాతో ఘనంగా సన్మానించి, శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం మేమేంటోను బహూకరించారు. అనంతరం ఈ నెల 30న జరగనున్న ముక్కోటి ఏకాదశి పర్వదిన కార్యక్రమాలకు హాజరై భక్తులకు ఆశీర్వచనాలు అందించాలని కోరుతూ ఆహ్వాన పత్రికను మంత్రివర్యులకు అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతి దేవస్థానం లడ్డును కూడా అందించడం జరిగింది. మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ ఆహ్వానాన్ని సంతోషంగా స్వీకరించి, వీలును బట్టి కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. ఇల్లందకుంట ప్రాంత ప్రజల ఆధ్యాత్మిక అభివృద్ధికి శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం కీలక పాత్ర పోషిస్తోందని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు గోడిసెల పరమేష్, గోలి కిరణ్, ఎడ్ల కిషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ముక్కోటి ఏకాదశి



సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, వైకుంఠ ద్వార దర్శనం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు

## జీ. మాడుగుల నూతన ఎస్సైకు జనసేన నాయకుల ఘన సన్మానం

పాడేరు నియోజకవర్గం । జీ. మాడుగుల



**సామాన్యుడి అస్త్రం అల్లూరి :** అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు నియోజకవర్గం జీ. మాడుగుల మండలంలో నూతనంగా ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన బోనంగి సాయిపడాల్‌కు జనసేన పార్టీ నాయకులు ఘనంగా సన్మానం నిర్వహించారు. జనసేన పార్టీ జీ.మాడుగుల మండల అధ్యక్షుడు మసాడి భీమన్న, పిఏసీఎస్ చైర్మన్ తల్లే త్రిమూర్తులు, రేగం అప్పలకొండబాబు, జనసేన పార్టీ జీ.మాడుగుల బూత్ కన్వీనర్ కొర్ర భాను ప్రసాద్ తదితరులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా ఎస్సైని కలిశారు. ఈ సందర్భంగా దుశ్శాలువా కప్పి, పూలమాలలు, బుకెలతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. జీ.మాడుగుల మండలంలో శాంతి భద్రతలను మరింత బలోపేతం చేయాలని, ప్రజలకు భద్రతాభావం కలిగేలా పోలీస్ శాఖ సేవలు అందించాలని నాయకులు కోరారు. నూతన ఎస్సై స్పందిస్తూ ప్రజల సహకారంతో చట్టసంరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వనబంగి రాములమ్మ, జనసేన పార్టీ వీరమహిళ గండేరి పార్వతమ్మ, జీ.మాడుగుల మండల నాయకులు కోరాబు చరణ్, పలాసీ సన్యాసినాయుడు, మంజిలీ శేఖర్, ఉల్లి తిరుపతిరావు, కీముడు కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

## రేపు చింతపల్లిలో టిడిపి అత్యవసర సమావేశం

పాడేరు నియోజకవర్గ ఇంచార్జి గిడ్డి ఈశ్వరి హాజరు

పార్టీ బలోపేతమే లక్ష్యంగా కీలక చర్చలు



**సామాన్యుడి అస్త్రం అల్లూరి :** మండల టిడిపి అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో రేపు టిడిపి అత్యవసర సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాడేరు నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి హాజరవుతున్నారు. ఈ అత్యవసర సమావేశం రాజేంద్రపాలెం జడ్పీ గెస్ట్ హౌస్‌లో రేపు ఉదయం 10 గంటలకు జరగనుంది. పార్టీ బలోపేతం, రాబోయే రాజకీయ పరిణామాలు, మండల స్థాయిలో కార్యాచరణ, ప్రజా సమస్యలపై పోరాట కార్యాచరణ వంటి అంశాలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించనున్నట్లు సమాచారం. ఈ సమావేశానికి మండల కమిటీ సభ్యులు, క్లస్టర్ ఇంచార్జిలు, యూనిట్ ఇంచార్జిలు, బూత్ ఇంచార్జిలు, సర్పంచులు, పార్టీ కార్యకర్తలు, మహిళా నాయకులు తప్పనిసరిగా హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని పార్టీ నాయకత్వం పిలుపునిచ్చింది. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, ప్రజల్లో పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా తీసుకెళ్లే దిశగా స్పష్టమైన కార్యాచరణ రూపొందించడమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశమని నాయకులు వెల్లడించారు.

## ఫలించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కృషి

**సామాన్యుడి అస్త్రం ఇల్లందకుంట :** ఖేలో ఇండియా నిధులతో జమ్మికుంటకు అథ్లెటిక్ ట్రాక్ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఖేలో ఇండియా పథకం ద్వారా క్రీడలను గ్రామ స్థాయికి చేర్చాలన్న లక్ష్యానికి జమ్మికుంట పట్టణం ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోందని బిజేపీ సీనియర్ నాయకులు మట్ట పవన్ రెడ్డి పేర్కొన్నారు. ఇల్లందకుంట మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జమ్మికుంట పట్టణంలో 4 లైన్ల సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ నిర్మాణానికి రూ. 6.50 కోట్ల నిధులను యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ద్వారా కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయడం హర్షణీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా అంతర్జాతీయ స్థాయి క్రీడా మౌలిక వసతులు కల్పించాలన్న కేంద్ర ప్రభుత్వ దూరదృష్టి ఫలితంగా ఈ ప్రాజెక్టు సాకారం అవుతోందని తెలిపారు. ఈ నిధుల మంజూరుతో జమ్మికుంటతో పాటు పరిసర ప్రాంతాల యువతకు ఉత్తమ శిక్షణా అవకాశాలు లభిస్తాయని, స్థాయిలో నిలబెట్టాలన్న కేంద్ర ప్రభుత్వ క్రీడా విజన్‌కు ఇది మరో బలమైన ఉదాహరణ అని చెప్పారు. మోదీ ప్రభుత్వ అభివృద్ధి లక్ష్యాల్లో క్రీడలకు కూడా కీలక స్థానం ఉందని ఈ నిర్ణయం మరోసారి రుజువు చేసిందన్నారు.



ట్రాక్ నిర్మాణం పూర్తయితే జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక, కమలాపూర్ తదితర పరిసర మండలాల యువ అథ్లెట్లకు అంతర్జాతీయ స్థాయి శిక్షణా వేదిక అందుబాటులోకి వస్తుందని తెలిపారు. భవిష్యత్తులో ఇక్కడి యువ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ వేదికలపై పతాకాలు ఎగరవేస్తారనే సంపూర్ణ నమ్మకం తమకుందన్నారు. ఈ ప్రాజెక్టు కోసం కృషి చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర మంత్రి వర్యులు కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ అలాగే యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ మంత్రి మన్సుక్ మాండవియ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## తెలంగాణ స్పోర్ట్స్ కరాటే డో అసోసియేషన్ ఆధ్వర్యంలో జనరల్ బాడీ సమావేశం

ముఖ్య అతిథిగా పిసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

**సామాన్యుడి అస్త్రం జనగామ** తెలంగాణ స్పోర్ట్స్ కరాటే డో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశం ముఖ్య అతిథిగా పిసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ స్పోర్ట్స్ కరాటే డో అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా షిహాన్ మాల్యాల రామస్వామిని, ట్రెజరర్‌గా మల్లికార్జున గౌడ్‌ను జనగామ ప్రెసిడెంట్ జకుల వేణుమాధవ్, జనరల్ సెక్రటరీ కొయ్యాడ రవి, ట్రెజరర్ ఎర్రవెల్లి బాబు ను నియమిస్తూ మహేష్ కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే జిల్లాల నుంచి హాజరైన జిల్లా అధ్యక్షులు, జిల్లా సెక్రటరీలు, రాష్ట్ర చీఫ్‌లు ఇండియా చీఫ్‌లకు అసోసియేషన్ అభివృద్ధి, క్రీడాకారుల ప్రోత్సాహం, కరాటే క్రీడను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించడంపై పలు కీలక




సూచనలు చేశారు.

## జంగాడపల్లికి ప్రత్యేక పంచాయతీ కావాలి



మారుమూల ఆదివాసి గ్రామాలకు అందని ప్రభుత్వ పథకాలు

జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన గ్రామస్తులు

**సామాన్యుడి అస్త్రం అల్లూరి :** అల్లూరి సీతారామరాజు జిల్లా, పాడేరు మండలం, అయినాడ పంచాయతీ పరిధిలోని జంగాడపల్లి గ్రామంతో పాటు చుట్టుపక్కల ఆదివాసి గ్రామాల ప్రజలు నూతన పంచాయతీ ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌కు గ్రీవెన్స్ కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, అయినాడ పంచాయతీ కేంద్రం ఒక వైపున ఉండగా మొత్తం 33 గ్రామాలు ఒక వైపు, మిగతా 13 గ్రామాలు మరో వైపున ఉండటం వల్ల తమ గ్రామాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సరైన విధంగా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా జంగాడపల్లి చుట్టుపక్కల ఉన్న మారుమూల గ్రామాలు అభివృద్ధికి దూరంగా మిగిలిపోతున్నాయని తెలిపారు. జంగాడపల్లి కేంద్రంగా ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేస్తే సుమారు 13 గ్రామాలకు చెందిన 4,500 మందికి పైగా జనాభాకు ప్రభుత్వ పథకాలు నేరుగా అందే అవకాశం ఉంటుందని గ్రామస్తులు పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ గ్రామాల్లో సుమారు 2,800 మంది ఓటర్లు ఉన్నారని, అన్ని అర్హతలు ఉన్నప్పటికీ పంచాయతీ లేకపోవడం వల్ల అభివృద్ధి నిలిచిపోయిందని తెలిపారు. అయినాడ పంచాయతీని రెండు భాగాలుగా విభజించి జంగాడపల్లి కేంద్రంగా నూతన పంచాయతీ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ నూతన పంచాయతీ పరిధిలో పూతిగరువు, పెద్దాపురం, గుల్లిపల్లి, బలుమలు, వంటలపాడు, దారిగడ్డ, కొండంపూడి, నేరెడ్లు, తొలుగూరు, గడ్డిబంధాలు, గూనగుమ్మి, గిన్నెకరువు, జంగాడపల్లి వంటి గ్రామాలను చేర్చాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అందరూ మమేకమై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, కనీసం ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేసి అభివృద్ధికి మార్గం సుగమం చేయాలని కోరారు.

## కెసిఆర్...మీ అర్థరహిత విమర్శలను ప్రజలు క్షమించరు

గజ్వేల్ కార్యకర్తల కృషితో ఫాంహౌజ్ కే కేసీఆర్ పరిమితం

కెసిఆర్ వ్యంగ్య విమర్శలకు హద్దు అదుపు లేకుండా పోతోంది

సీఎం రేవంత్ రెడ్డి పాలనకు రాష్ట్రంలో చక్కటి స్పందన

కాంగ్రెస్ ప్రజా రంజక పాలనతో పేదలు సంతోషం

రాష్ట్ర మంత్రులు గడ్డం వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్



**సామాన్యుడి అస్త్రం గజ్వేల్** మాజీ సీఎం కేసీఆర్ చేస్తున్న వ్యంగ్య విమర్శలను ప్రజలు క్షమించరని, అర్థరహిత విమర్శలకు కూడా హద్దుశీటూ ఉండాలని రాష్ట్ర మంత్రులు గడ్డం వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం సిద్ధిపేట జిల్లా గజ్వేల్ లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తూశీకుంట అంక్షా రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన నూతన సర్పంచుల ఆత్మీయ సమ్మేళనం, సన్మాన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిలుగా హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి చేపడుతున్న ప్రజా రంజక పాలనతో చక్కటి ఫలితాలు రాగా, గుబులు పుట్టిన కేసీఆర్ ఫాంహౌజ్ వీడినట్లు ఎద్దేవా చేశారు. సర్పంచ్ ఎన్నికల్లో లక్షకుపైగా ఓట్లు సాధించిన కాంగ్రెస్ అభ్యర్థులు కెసిఆర్ ను నైతికంగా ఓడించినట్లు స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేని దరిద్రపు భాషను ప్రవేశపెట్టిన కేసీఆర్ ఇంకా తన పద్ధతి మార్చుకోవడం లేదని ఎద్దేవా చేశారు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న చారిత్రాత్మక పథకాలైన ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీతో పేద ప్రజలు సంతోషంగా ఉన్నట్లు తెలిపారు. ఈ క్రమంలో రాష్ట్రంలో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో చక్కటి ఫలితాలు రాగా, అదే స్ఫూర్తితో గజ్వేల్ లో ఎంపీటీసీ, జెడ్పిటిసి ఎన్నికల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు. కార్యకర్తల కష్టంతోనే 92 సర్పంచ్ స్థానాలను గెలుచుకోగా, త్వరలోనే గజ్వేల్ సర్పంచులను సీఎం రేవంత్ రెడ్డితో కలిపిస్తానని హామీ ఇచ్చారు. క్రమశిక్షణ కలిగిన గజ్వేల్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు జూబ్లీహిల్స్ ఎన్నికల్లో సైతం కష్టపడగా, సమిష్టి కృషితో కెసిఆర్ ను ఎదుర్కొంటుండడం హర్షనీయమని అన్నారు. అయితే సిద్ధిపేట జిల్లాతో పాటు గజ్వేల్ ప్రాంతానికి కావాల్సిన అభివృద్ధి పనులు, నిధుల మంజూరి అంశాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తేగా, అదనపు ఇండ్లు, సిసి రోడ్లు తదితర అభివృద్ధి పనుల మంజూరీకి సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రజా సమస్యల పరిష్కారంలో సర్పంచ్ల పాత్ర ఎంతో ఉంటుందని, దీనిని దృష్టిలో పెట్టుకొని నిరంతరం వారికి అందుబాటులో ఉంటూ సేవలందించాలని కోరారు. గజ్వేల్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే తూశీకుంట నర్సారెడ్డి నేతృత్వంలో మంచి ఫలితాలు వస్తుండగా, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఆయనను గెలిపించి ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ లో కూర్చుండబెట్టే బాధ్యత పార్టీ శ్రేణులు తీసుకోవాలని అన్నారు. కష్టపడే తత్వం కలిగిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులను కలిగి ఉండడం ఆయన అదృష్టమని వివరించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి అధ్యక్షత వహించగా, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు, భూశీ రెడ్డి, ఎలక్షన్ రెడ్డి, డిసిసిబి మాజీ చైర్మన్ దేవేందర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, విజయ మోహన్, సర్దార్ ఖాన్, ప్రభాకర్ గుప్త, సర్పంచుల ఫోరం అధ్యక్షులు అశోక్ రెడ్డి, వెంకటేష్, ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సందీప్ రెడ్డి, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్, కిష్టా గౌడ్, సుఖేందర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చింతపల్లి పోలీస్ స్టేషన్‌కు నూతన సారథి

ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన జి. వీరబాబు

వి.వెంకటేశ్వరరావు నుంచి అధికారికంగా చార్జ్ హస్తాంతరణలి



**సామాన్యుడి అస్త్రం అల్లూరి :** చింతపల్లి పోలీస్ స్టేషన్‌కు నూతనంగా నియమితులైన ఎస్సై జి. వీరబాబు ఈరోజు అధికారికంగా విధుల బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటివరకు ఎస్సైగా సేవలందించిన వి. వెంకటేశ్వరరావు నుండి స్టేషన్ బాధ్యతలను ఆయన అధికారికంగా స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది, సిబ్బంది అధికారులు హాజరై నూతన ఎస్సైకి శుభాకాంక్షలు తెలిపారు. చింతపల్లి పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు, ప్రజలకు మరింత సమర్థవంతమైన పోలీస్ సేవలు అందించడమే తన ప్రథమ లక్ష్యమని ఎస్సై జి. వీరబాబు పేర్కొన్నారు. అలాగే ప్రజలు పోలీస్ శాఖతో సమన్వయం కలిగి ఉండాలని, సమస్యల పరిష్కారంలో పోలీస్ స్టేషన్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు. ముఖ్యంగా యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఇప్పటివరకు చింతపల్లి ఎస్సైగా విధులు నిర్వహించిన వి. వెంకటేశ్వరరావు చేసిన సేవలను ఈ సందర్భంగా పలువురు అభినందించారు. ఆయన సేవలు చింతపల్లి ప్రజలకు ఎప్పటికీ గుర్తుండిపోతాయని స్థానికులు పేర్కొన్నారు. నూతన ఎస్సై బాధ్యతల స్వీకరణతో చింతపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో మరింత కట్టుదిట్టమైన పోలీస్ వ్యవస్థ అమలవుతుందనే ఆశాభావాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

## కాసుగంటి సుధాకర్ రావు హఠాన్మరణం కాసుగంటి మృతి పట్ల ఎమ్మెల్యే సంజయ్‌గ్భ్రాంతి

**జగిత్యాల :** భారతీయ నాగరికత విద్యా సమితి అధ్యక్షుడు,పారిశ్రామికవేత్త కాసుగంటి సుధాకర్ రావు(80) గత కొంతకాలంగా వృద్ధాప్యంతో పాటు అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రాత్రి హైదరాబాదులోని ఆయన నివాసంలో మృతి చెందారు. ఎస్ ఆర్ ఎస్ పి లో ఇంజనీర్ గా ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి భారతీయ నాగరికత విద్యాసంస్థ పేరిట జిల్లా కేంద్రంలో శ్రీ సరస్వతి శిశు మందిర్ తోపాటు శ్రీ వాణి సహకార జూనియర్ కళాశాలను స్థాపించారు.ఈ ప్రాంత రైతులకు దాదాపు 40 ఏళ్ల క్రితమే దిగుమతి వల్ల కలిగే వ్యయ భారం రైతులకు లేకుండా గోదావరి వ్యాలీ పరిశ్రమను ఏర్పాటు చేసి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో గోదావరి అగ్రి ఎక్విప్మెంట్స్ ను అందించారు. అంతేకాకుండా సమాజ సేవలో కూడా తాను ముందుండి జగిత్యాలలో రోటరీ క్లబ్ ను ప్రారంభించి ఎన్నో సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహించారు. ఎంతోమంది నిరుపేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించడమే కాకుండా ఎన్నో సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో తన వంతు సహాయ సహకారాలు అందించారు. ఈ ప్రాంత యువతకు విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించిన కాసుగంటి సుధాకర్ రావు ఆకస్మిక మృతి పట్ల జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్గ్భ్రాంతి వ్యక్తం చేశారు.

# వరల్డ్ కప్ విజేతకు ఘన స్వాగతం

**పాంగి కరుణకుమారి విజయోత్సవ ర్యాలీలో టిడిపి నేతల పాల్గొనడం**

**ఏజెన్సీ ప్రాంతానికి ప్రపంచ స్థాయి గుర్తింపు**



**సామాన్యుడి అస్త్రం అల్లూరి :** ప్రపంచ కప్ విజేతగా నిలిచిన జట్టులో సభ్యురాలైన ఏజెన్సీ ప్రాంత క్రికెటర్ పాంగి కరుణకుమారి విజయాన్ని పురస్కరించుకుని నిర్వహించిన అభినందన ర్యాలీలో ఏపీ టూరిజం డైరెక్టర్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిల్లు వెంకట రమేష్ నాయుడు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకుడు శోభ శ్రీనివాస్, యువ నాయకుడు వనుగు సురేంద్రతో పాటు పెద్ద సంఖ్యలో టిడిపి నాయకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే విద్యార్థినులు, విద్యార్థులు భారీగా హాజరై ర్యాలీని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతం నుంచి ప్రపంచ క్రికెట్ వేదికపై వరల్డ్ కప్ గెలుపు సాధించడం జిల్లా ప్రజలకు అపూర్వ గర్వకారణమని పేర్కొన్నారు. ఈ విజయం అల్లూరి సీతారామరాజు జిల్లాకే కాకుండా రాష్ట్రం, దేశం మొత్తం గర్వపడాల్సిన ఘనతగా అభివర్ణించారు. పాంగి కరుణకుమారి సాధించిన విజయం ఆదివాసి యువతకు స్ఫూర్తిగా నిలుస్తుందని, ఇలాంటి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి, సమాజానికి ఉందని అభిప్రాయపడ్డారు. విజయోత్సవ ర్యాలీ సందర్భంగా గ్రామం మొత్తం సంబర వాతావరణంలో మునిగిపోయింది. యువత, విద్యార్థులు నినాదాలతో కరుణకుమారి విజయాన్ని ఘనంగా కొనియాడారు.

# కుంభస్థలం లాంటి పెద్ద గ్రామ పంచాయతీల్లో గులాబి జెండా ఎగిరింది



**వనపర్తి :** ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలి .నీళ్లు ఇవ్వడానికి చేతకాక క్రాప్ హాలీడే ఇస్తున్నారు .రైతులు కష్టపడుతుంటే జిల్లా మంత్రి విహార యాత్ర చేస్తున్నాడు .పాలమూరు నది జాలాల హక్కుల సాధనకై సమావేశం .సోలిపూర్, సవాయి గూడెం ఫలితాలపై మీద కోర్టు లో కేసులు వేసాం..పెట్టుబడి లేని వ్యాపారం అంటే ఒక్కటే ఇతరులను విమర్శించడం..మాజీ పార్లమెంట్ సభ్యులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల చంద్ర శేఖర్ రెడ్డి .మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డిఅధికార పార్టీ అహం, మద్యం, డబ్బుల ముందు ఫోటి లో నిలబడి గులాబీ జెండా మెడలో వేసుకుని ప్రజాక్షేత్రంలో యుద్ధం చేసి కుంభస్థలం లాంటి పెద్ద గ్రామ పంచాయతీ ల్లో గులాబి జెండా ఎగుర వేశారని ఎన్ని అడ్డంకులు సృటించిన రాష్ట్ర స్థాయి లో చరిత్ర సృష్టిచారు గోపాల్ పేట మండల ప్రజలు అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రం లోని తన నివాస గృహం నుండి స్థానిక నాయకులతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించి అనంతరం రాజాపేట గ్రామ శివారులో గల జిల్లా పార్టీ కార్యాలయంలో నూతన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లకు అభినందనలు తెలుపుతూ పాలమూరు నది జాలాల హక్కుల సాధనకై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం మీద అధికారం లోకి వచ్చిన తరువాత రెండు నెలలోనే ప్రజల్లో వ్యతిరేకత వచ్చిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని లక్షల మంది రైతులు యూరియా కోసం నిలబడ్డారని, ప్రభుత్వ ఉద్యోగుల పదవి విమరణ తరువాత రావాల్సిన డబ్బు లు ఇవ్వలేదని ప్రభుత్వ సంక్షేమ హాస్టల్ లో 60 మంది విద్యార్థులు చనిపోయారు, 700 మంది రైతులు చనిపోయారని ఇవ్వని ప్రభుత్వ వైఫల్యంకు నిదర్శనమన్నారు. నీళ్లు అదించడానికి చేత కాక జూరాల ప్రాజెక్టు నుండి 45 రోజులు వరద నీరు వృధాగా సముద్రం లో కలిసిన తరువాత కే ఎల్ ఐ మోటార్లు ఆన్ చేసారని వరద నీరు వచ్చిన సమయంలో ఆన్ చేస్తే ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు. జూరాల ప్రాజెక్టు కు పైన గల ప్రభుత్వం తో మాట్లాడి గతంలో నీళ్లు అందించి క్రాప్ హాలీడే అనేది లేకుండా చేశామని కాంగ్రెస్ ప్రభుత్వం వరద నీరు సముద్రం లోకి వెళ్లిన తరువాత కర్ణాటక తో మాట్లాడలేక క్రాప్ హాలిడే ప్రకటించారన్నారు. నీళ్లు లేక రైతులు కష్టపడుతుంటే ఇక్కడ ఉన్న జిల్లా మంత్రి కుటుంబ సభ్యులతో కలిసి సోమశిలలో విహార యాత్ర చేస్తున్నాడని అయన విమర్శించారు. గులాబీ పార్టీ పుట్టినప్పటి నుండి ఎన్ని ఉద్యమాలు జరిగిన, ఎన్నికలు జరిగిన గులాబి నాయకుల పోరాటం వెలకట్టలేనిదని పోరాడి ఓడిపోయినా వాళ్లు బాధ పడలేదు ఇక్కడికే అయ్యిపోయేలేదని భవిష్యత్ ఉందన్నారు. ప్రభుత్వం జెడ్పిటిసి, ఎంపిటిసి ల ఎలక్షన్ పెట్టడం లేదని పెడితే ప్రస్తుతం రైతు భరోసా ఇవ్వాలి కాదా అవి ఇవ్వలేక జెడ్పి టీసి, ఎంపిటిసి ఎన్నికల గురుంచి మాట్లాడడం లేదని నిధులు వస్తాయి కాబట్టి రెండు సంవత్సరాల తరువాత గ్రామ పంచాయతీ ఎన్నికలు పెట్టారని ఆ కోవలోనే నిధులు ఎక్కడ తిరిగి పోతాయని ఉద్దేశ్యంతో మున్సిపాలిటీ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం ఆలోచిస్తుంది ఎంత వరకు ఆపితే అంత వరకు ఆపడానికి జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలను వాయిదా వేస్తున్నారన్నారు ఎమ్మెల్యే, మంత్రులు విధాన పరమైన నిర్ణయాలు మాత్రమే అనుసరించాలి తప్ప పూర్తి స్థాయి లో గ్రామ పంచాయతీ పరిధిలో సర్పంచులకు చెక్ పవర్ ఉంటుంది. ప్రతి అంశం లో విషయ పరిజ్ఞానం పెంచుకోవాలి. ప్రజలతో సఖ్యతతో ఉండాలని నూతన సర్పంచులకు అయన సూచించారు. గ్రామ పంచాయతీ లలో పాలక మండలి సమావేశం, ప్రతి మూడు నెలలకు ఒకసారి గ్రామ సభ పెట్టాలని అందుకు సంబందించి కార్యదర్శి కు ఆదేశాలు ఇవ్వాలి సభలో చర్చించాల్సిన అంశాలను ఎజెండా లో పొందు పరిచి మాట్లాడాలన్నారు. పాత ట్రాక్టర్ల లకు పట్టిన దుమ్ము దులపండి చెట్లకు నీళ్లు పోయండని పారిశుద్ధం మంచి నీరు మీద ప్రత్యేక దృష్టి పెట్టాలని . ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలన్నారు. వ్యక్తిగత పంచాయతీ లకు సర్పంచులు దూరంగా ఉండాలి అంతే తప్ప వ్యక్తిగత పంచాయతీలన్ని నెత్తిన వేసుకోవద్దని ప్రజలకు ఏది ఉపయోగమో అది చేయాలి మీరు చేసే పని మీదనే మీకు విలువ పెరుగుతుందన్నారు. గ్రామ పంచాయతీ లకు మన డబ్బులు మనకు వస్తాయి జి ఎస్టీ చట్టం లో మనం కొనే ప్రతి దానికి ట్యాక్స్ ఢిల్లీ కి పోతుందని రాష్ట్రం నుండి ఎంత ట్యాక్స్ పోతుందో అంత ట్యాక్స్ ఢిల్లీ ఇవ్వాలి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న జనాభా ను దృష్టిలో పెట్టుకుని మనిషి ఇంత అని నిధులను మంజూరు చేస్తారని . కొంతమంది కేంద్రం నుండి వస్తాయి అని చెబుతారు ఇవి ఎవరబ్బా సొమ్ము లు కావు మనం కట్టిన ట్యాక్స్ మనకు వస్తాయని ఆయన వివరించారు. దేశంలో అభివృద్ధి జరిగిన ఆదర్శ గ్రామాలను నూతన సర్పంచులు వెళ్ళి రావాలని అందుకు తగ్గ ఏర్పాట్లు తాను చేయడం జరుగుతుందని ఆయన వివరించారు. గడిచిన రెండేళ్ల లో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు లో తట్టేడు మన్ను తీయలేదు.ఉమ్మడి పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు దిశగా పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు లో భాగంగా తమ ప్రభుత్వం లో 90 శాతం పనులు పూర్తి చేసినప్పటికి మిగిలిన పనులను చేయకుండా గడిచిన రెండేళ్ల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం తట్టేడు మన్ను కూడా తీయలేదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు . ఉమ్మడి పాలమూరు జిల్లాలో 35 లక్షల ఎకరాలు ఉండగా అందులో కేవలం 10 లక్షల ఎకరాల్లో సాగు అవుతుందని అందులో 9 లక్షల ఎకరాలకు కే సి ఆర్ ప్రభుత్వం లో సాగు నీరును అందించడం జరిగిందని మిగిలిన ఎకరాలకు నీళ్లు అందించడానికి పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు కు రూపకల్పన చేసి రిజర్వాయర్లు, పంపింగ్ స్టేషన్లు పనులు చేయడం జరిగిందని మిగిలి పోయిన పనులను పూర్తి చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. మనకు కృష్ణ నదిలో నికర జలాల్లో ఒక్క పాలమూరు కు 200 టి ఎం సి లు రావాలని కానీ ప్రాజెక్టు లలో 40 టి ఎం సి లు కూడా లేవన్నారు. ఆంధ్రాలో చంద్రబాబు కింద పని చేసిన ఆదిత్య నాథ్ అధికారి తెలంగాణ కు నీళ్లు వద్దని చెప్పిన వ్యక్తి ని తెలంగాణ ప్రభుత్వ నీటి సలహా దారుడిగా గా ఇక్కడి సి ఎం పెట్టుకున్నారని కాంగ్రెస్ హయాంలో జరుగుతున్న జల దోపిడీని ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. జనవరి నెలలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ల కే సి ఆర్ సభలు సమావేశాలను నిర్వహించడం జరుగుతుందని అందుకు సంబందించి పార్టీ ఎ పిలుపునిచ్చిన ఉద్యమం కు అందరు తయారు అయ్యి ఉండాలని అందుకు గ్రామాల, మండల, నియోజకవర్గం, నాయకులతో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. సోలిపూర్, సవాయి గూడెం ఎన్నికల ఫలితాలపై కోర్టు కు వెళ్లాం.ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సోలిపూర్, సవాయి గూడెం లో ముందుగా మనవాళ్ళు గెలిచారని అధికారులు చెప్పారు కానీ తరువాత కాంగ్రెస్ వాళ్లు గెలిచారని చెప్పారని దాని మీద కోర్టులో కేసు లు వేయడం జరిగిందన్నారు. త్వరలో నే తీర్పు వస్తుందన్నారు. అనంతరం శ్రీ రంగా పురం మండల కేంద్రానికి చెందిన వార్డు మెంబెర్ రాములు బిజెపి పార్టీ నుండి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి. సమక్షంలో బి ఆర్ ఎస్ పార్టీలో చేరారు.పెట్టుబడి లేని వ్యాపారం అంటే ఒక్కటే ఇతరులను విమర్శించడం.... మాజీ పార్లమెంట్ సభ్యులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల చంద్ర శేఖర్ రెడ్డి.ప్రస్తుత కాలంలో ఎ పని చేయాలన్న ఖర్చు తో కూడుకున్నది కానీ ఎలాంటి ఖర్చు, పెట్టుబడి లేకుండా ఉండే వ్యాపారం అంటే అది కేవలం ఇతరులను విమర్శించడం అని అవతలి వాళ్లు ఎప్పుడు తిట్టుకుంటూనే ఉంటారని వాళ్లకు తిట్లు మాత్రమే మిగులుతాయని మనం ఎవరిని తిట్టమని మనం చేసిన అభివృద్ధి మాత్రమే కనిపిస్తుందని మాజీ పార్లమెంట్ సభ్యులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల చంద్ర శేఖర్ రెడ్డి అన్నారు. మీ వల్ల జనాలకు మంచి జరగాలి ఆ దిశగా సర్పంచ్ లు పని చేయాలని 1994 ఎన్నికల్లో తాను అప్పాయపల్లి గ్రామాల్లో ఏజెంట్ పెట్టె పరిస్థితి లేకుండే అని కానీ నిరంజన్ రెడ్డి నాయకత్వం లో ప్రతి సారి మన వాళ్లు గెలవడం హర్షించదగ్గ విషయమన్నారు. సర్పంచ్ లు చట్టం లో మీకు ఉన్న బాధ్యతలు ఏమిటి అధికారం ఏమిటి అనేది తెలుసుకోవాలి నేర్చుకోవాలి అనుభవాని గడించాలని ప్రతి దానికి డబ్బు అవసరం లేదని మనసు పెట్టి ప్రజలోకి వెళ్ళితే ఆదరిస్తారని ఆయన వివరించారు. 2018 లో అప్పటి తెలంగాణ ప్రభుత్వం పంచాయతీ రాజ్ చట్టం తీసుకుని రావడం జరిగిందని అందులో అన్ని అంశాలు ఉంటాయని నిధులను రాజ్యాంగ సవరణ 73, 74 ద్వారా స్టేట్ ఎలక్షన్ కమిషన్ వచ్చిందని ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి ఎన్నికలు నిర్వహించాలి కాబట్టి ప్రభుత్వం ఎన్నికలను నిర్వహించారని కేంద్ర ప్రభుత్వం నుండి రావాల్సిన నిదులు నేరుగా గ్రామ పంచాయతీ లకు వస్తాయని ఎవరు భయపడాల్సిన అవసరం లేదన్నారు. పాత వరంగల్ ప్రస్తుత మహబూబాబాద్ లో బి ఆర్ ఎస్ అభ్యర్థులు గెలిచిండు అని పత్రం ను తీసుకుని ఇంటికి వెళ్లిన తరువాత కాంగ్రెస్ పార్టీ గెలిచినట్లుగా ఇచ్చారని వాటి మీద కోర్టు కు వెళ్లడం జరిగిందని అందుకు సంబందించి ప్రతి ఖర్చు కే సి ఆర్ పెట్టు కోవడం జరుగుతుందన్నారు. గ్రామాలలో క్రమం తప్పకుండ గ్రామ సభలు పెట్టాలని ప్రతి అంశాన్ని రికార్డ్ లో పొందుపరాచాలని గ్రామ సభ పెట్టకుంటే పంచాయతీ కార్యదర్శి ఒక లెటర్ పెట్టడం వల్ల సర్పంచులకు ఇబ్బంది కలుగుతుందన్నారు. గ్రామాల్లో పారిశుద్ధం, తాగు నీరు, విద్య, వైద్యం పైన ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రజల కోసం కే సి ఆర్ మిషన్ భగీరథ ద్వారా నీళ్ల ట్యాపింగ్ పెడితే ప్రస్తుత ప్రభుత్వం నీళ్లను వదిలి పెట్టి ఫోన్ ట్యాపింగ్ పెట్టారన్నారు. నాయకులు, కార్యకర్తలు రెండే లక్ష్యాలు ఒకటి కే సి ఆర్ ముఖ్యమంత్రి కావడం, రెండవది ,నిరంజన్ రెడ్డి.అసెంబ్లీ లోకి పోవాలన్నారు. గత ప్రభుత్వం చేసిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కార్యకర్తల మీద ఉంటుందన్నారు . ఈ కార్యక్రమం లో నాగం తిరుపతి రెడ్డి, జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, పట్టణ అధ్యక్షులు రమేష్ గౌడ్, మాజీ ఎంపిపి కృష్ణ నాయక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మారెడ్డి, మండల అధ్యక్షులు మాణిక్యం, నాయకులు విజయ్, కురుమూర్తి యాదవ్, చిట్యాల. రాము తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ క్రికెట్ వేదికపై అల్లూరి జిల్లాకు అపూర్వ గౌరవం

**వంట్లమామిడి క్రికెటర్ పాంగి కరుణకుమారి విజయోత్సవ ర్యాలీకి ఘన స్పందన**

**ప్రజాప్రతినిధులు, గ్రామస్తులకు కృతజ్ఞతలు**



**సామాన్యుడి అస్త్రంఅల్లూరి:** అల్లూరి సీతారామరాజు జిల్లా, వంట్లమామిడి గ్రామానికి చెందిన ఆదివాసి క్రికెటర్ పాంగి కరుణకుమారి ప్రపంచ క్రికెట్ వేదికపై వరల్డ్ కప్ విజయం సాధించడం జిల్లా ప్రజలకు అపూర్వ గర్వకారణంగా నిలిచింది. ఈ ఘన విజయాన్ని పురస్కరించుకుని నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు, అభిమానులకు కరుణకుమారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన వారు, ఆదిమా జాతిలో పుట్టడం గర్వించదగిన విషయమని, అటువంటి సమాజం నుంచి ప్రపంచ స్థాయిలో ప్రతిభ చూపించి దేశానికి గౌరవం తీసుకొచ్చిన క్రీడాకారిణి ఉండటం ప్రతి ఆదివాసికి స్ఫూర్తినిచ్చే విషయం అన్నారు. వరల్డ్ కప్ గెలుపు అల్లూరి జిల్లాకే కాకుండా భారతదేశం మొత్తం గర్వించదగిన ఘనతగా అభివర్ణించారు. కరుణకుమారి సాధించిన విజయం వెనుక ఉన్న కష్టపాటు, పట్టుదల, సమాజ సహకారం మరెందరికో మార్గదర్శకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి ప్రతిభను మరింత ప్రోత్సహించేందుకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, సమాజం కలిసి సహాయ సహకారాలు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. విజయోత్సవ ర్యాలీ సందర్భంగా గ్రామమంతా సంబర వాతావరణం నెలకొనగా, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. కరుణకుమారి విజయం రాబోయే తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందన్న నమ్మకాన్ని గ్రామస్తులు వ్యక్తం చేశారు.

## చిన్నకోడూర్ రైల్వే స్టేషన్ పనులు ప్రారంభించాలి:

**మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు**

**సిద్ధిపేట :** రైల్వే లైన్ పనుల్లో కాలువల్లో కూడుకపోయిన మట్టిని వెంటనే తొలగిం చాలి కాలువల మీద జరుగుతున్న రైల్వే బ్రిడ్జ్ పనులు వేంటనే పూర్తి చేయాలి.రైల్వే లైన్, కాలువ పనుల్లో ఇబ్బందులు లేకుం డా చూడాలిరైల్వే అధికారులు, ఇరిగేషన్ అధికారుల సమన్వ యంతో పని చేయాలి. చిన్నకోడూరు లో నిర్మించే రైల్వే స్టేషన్ స్థలాన్ని పరిశీలిం చిన హరీష్ రావు. చిన్నకోడూరు మండలం లో రైల్వే లైన్, సాగు నీటి కాలువ ల పనులను క్షేత్ర స్థా యిలో తిరిగి పరిశీలించిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు.రైల్వే లైన్ లో భాగంగా జరుగుతున్న పనుల నేపథ్యంలో సాగు నీటి కాలువ ల్లో మట్టి కూడుక పోయిందని వేంటనే తొలగించాలని రైల్వే అధికారులను హరీష్ రావు గారు ఆదేశించారు. రైల్వే అధికారులు, ఇరిగేషన్ అధికారులతో కలసి చిన్నకొడూర్ మండలం లోని రైల్వే లైన్ ను క్షేత్ర స్థాయి లో పరిశీలించారు. చిన్నకోడూరు మండల కేంద్రం లో రైల్వే స్టేషన్ మంజూరు అయిందని స్టేషన్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. స్టేషన్ పనులు వేంటనే ప్రారంభించాలని చెప్పారు. పలు సూచనలు చేసారు.అదేవిదంగా అధికారుల తో కలసి చిన్నకోడూరు, మాచపూర్, గంగపూర్ విఠలాపూర్ వరకు జరుగుతున్న రైల్వే పనులను క్షేత్రస్థాయి లో పరిశీలించారు. రైల్వే పనుల్లో భాగంగా రైల్వే లైన్ పక్కన ఉన్న సాగు నీటి కాలువల్లో మట్టి కూడుపక పోయిందని. వచ్చే యాసంగి లోపు మట్టిని తొలగించాలని అధికారులను కోరారు..రైల్వే లైన్ క్రాస్ అయ్యే క్రమం లో కాలువల మీద రైల్వే బ్రిడ్జ్ లు పురోగతి లో ఉన్నాయి. అ పనులు యాసంగి లోపు పూర్తి చేయాలని రైల్వే అధికారుల ను కోరారు.. వచ్చే యాసంగి లోపు రైతు లకు ఇబ్బందులు కలగకుండా రైల్వే అధికారులు, ఇరిగేషన్ అధికారులు సమన్వయం తో పని చేయాలని చెప్పారు.

## తెలంగాణ అసెంబ్లీ సమావేశాలకు ముహూర్తం ఫిక్స్

**హైదరాబాద్ :** తెలంగాణ శీతకాల అసెంబ్లీ సమావేశాలకు ముహూర్తం ఫిక్స్ అయ్యింది. 2025, డిసెంబర్ 29 నుంచి అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి.ఈ మేరకు గవర్నర్ ఆమోదంతో తెలంగాణ అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు నోటిఫికేషన్ జారీ చేశారు. అసెంబ్లీ సెషన్ ప్రారంభమైన తర్వాత సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించాలనే దానిపై బీఏసీ బిజినెస్ అడ్వైజరీ కమిటీ, సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు.ఈ సెషన్‌లో కృష్ణా,గోదావరి నీటి కేటాయింపులు, పాలమూరు-రంగారెడ్డి సహా పెండింగ్ ప్రాజెక్టులపై సమగ్ర చర్చ నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోన్నట్లు సమాచారం. అలాగే ఎంపీటీసీ, జెడ్పీటీపీ ఎన్నికలు, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించి కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చే ప్రణాళిక గురించి హౌస్?లో డిస్కస్ చేయనున్నట్లు సమాచారం.ఓ వైపు కృష్ణా, గోదావరి నీటి కేటాయింపుల విషయంలో ప్రభుత్వంపై కేసీఆర్ విమర్శలు చేయడం..మరోవైపు ఆయనకు కౌంటర్?గా అసెంబ్లీకి రావాలని సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసరడంతో ఈ సెషన్?పై ఉత్కంఠ నెలకొంది. బీఆర్ ఎస్ పార్టీ ఓటమి పాలైనప్పటి నుంచి అసెంబ్లీ సమావేశాలకు దూరంగా ఉంటున్న అపొజి షన్ లీడర్ కేసీఆర్,ఈ సారైనా అసెంబ్లీకి వస్తారా లేదా అనే దానిపై ఆసక్తి నెలకొంది.

## గజ్వేల్ నియోజకవర్గంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ లకు సన్మాన కార్యక్రమం

**సిద్దిపేట :** గజ్వేల్ నియోజకవర్గంలో నూతనంగా గెలిచిన 94 మంది సర్పంచ్ లను మంత్రులు పొన్నం ప్రభాకర్,వివేక్ వెంకట్ స్వామి అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తుంకుంట నర్సారెడ్డి , ఎలక్షన్ రెడ్డి,మాజీ డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ లు,ఇతర ముఖ్య నేతలుపాల్గొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.గజ్వేల్ నియోజకవర్గంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ లు,ఉపసర్పంచ్ లు,వార్డు సభ్యులకు అభినందనలు, శుభాకాంక్షలు.గజ్వేల్ గడ్డ మీద కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ లుగా గెలిచి ప్రజా పాలన ప్రభుత్వంలో రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో తీసుకుంటున్న.రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్,రాబోయే శాసన సభ,పార్లమెంట్ ఎన్నికల వరకు మీరే గ్రామాల్లో బలం.గతంలో సర్పంచ్ లకు అనేక ఇబ్బందులు ఉండేవిఇప్పుడు ఇందిరమ్మ ఇళ్లు,రేషన్ కార్డులు,సన్న బియ్యం పంపిణీ,200 యూనిట్ల ఉచిత విద్యుత్,500 కి గ్యాస్,సన్న వడ్లు బోనస్ లాంటి కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత సర్పంచ్ లది.ఇంచార్జి మంత్రి వివేక్ వెంకట్ స్వామి గ్రామాలకు ప్రత్యేక ఫండ్ ద్వారా అభివృద్ధి చేసేలా గ్రామాల్లో ఉన్న సమస్యలపై నివేదిక ఇవ్వండి అవసరమైన చోట బస్సులు ఇస్తాం. సమస్యల పరిష్కారానికి మీ బలం తోడవుతుంది.ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలివచ్చే దారిలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం కనబడింది అక్కడికి ఎవరు వెళ్ళడం లేదు,వచ్చే సారి కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉండాలి.ప్రజలు చెప్పే సమస్యలు పరిష్కారం దిశగా మేము అండగా ఉంటాం.సిద్దిపేట జిల్లాలోని ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కి అండగా ఉంటూ మనోధైర్యాన్ని ఇస్తున్నాంకాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటూ వారి సమస్యలు పరిష్కారం అయ్యేలా బాధ్యతగా వ్యవహరిస్తాం.మేము ఎన్ని చేసిన గ్రామాల్లో కనబడేది మీరు పార్టీ గౌరవాన్ని, ప్రభుత్వ గౌరవాన్ని కాపాడేలా మీరు ముందుండాలి.కాంగ్రెస్ శాసన సభ్యుడు లేని నియోజకవర్గల్లో ప్రత్యేక చొరవ తీసుకుని మీకు అండగా ఇంచార్జి మంత్రి ఉంటారు.ఓడిపోయిన వారిపై సానుభూతి ఉంటుంది వచ్చే ఎంపీటీసీ జడ్పీటీసీ ఎన్నికల్లో మీరు గెలవాలి.ప్రజల విశ్వాసాలకు అనుగుణంగా మనం పని చేయాలిసర్పంచ్ లుగా గెలిచిన అందరికీ పార్టీ పక్షాన ప్రభుత్వం పక్షాన అభినందనలు శుభాకాంక్షలు.

# పోలవరం దేశానికి వెన్నుముక
# కానీ పోలవరం గిరిజన నిర్వశితులకు పాడి (కట్టే ).

**చేపల వేటాకు వెళ్లి "తెలిపేరు గ్రామం "యువకుడు మృతి.**

**ఉపాధి కోసం, ఊరు కానీ ఊరు చేపల వేటకు వెళ్లి, నిర్జీవిగా ఇంటికి.**

**సామాన్యుడి అస్త్రం దేవీపట్నం :** అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజకవర్గం దేవిపట్నం మండలం, లో 44 గ్రామాలు ముంపు గురైన, గిరిజనులు, బ్రతుకులు చెట్టుకొకళ్ళు పుట్టకొకళ్ళు అన్నట్లు, భాంధవ్యలు మరిచేవిదంగా, ఎవరిబ్రతుకులు వారివే.... ఎవరి చావులు వారివే అంటూ ప్రాజెక్టు మొదలు, ప్రభుత్వాలు మారిన నిర్వాసితులకు ఏ ప్రభుత్వం కూడా అండగా నిలిచి, ధైర్యాన్నిలో ఇవ్వలేదు. వచ్చే పరిహారం కూడా ఆరకొరగా ఇచ్చి,కొన్ని కుటుంబాలకు అయితే ఎటువంటి ప్రభుత్వ సహాయం అందక, బ్రతుకుతెరువు కోసం వలసలు పోయి జీవించవలసిన పరిస్థితి, ఈ రోజున,దేవిపట్నం మండలం కొండమొదలు పంచాయతీ, తెలిపేరు గ్రామం,పెద్ద బీమ్ పల్లి 3 =&= కాలనీ కి చెందిన,అందాల ఆనంద్ రెడ్డి, అనే యువకుడు ఒక నెల క్రితం కొంతమంది తో కలిసి జీవనోపాధి కోసం చేపల వేటకు వెళ్ళాడు. ఇతనికి భార్య,నాలుగు నెలలు వయస్సు గల చిన్న కొడుకు ఉన్నాడు, కుటుంబం పోషణ కోసం చేపల వేటకు వెళ్ళాడు. నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం కొత్తపల్లి, సీమలతుప్ప వీరభద్రదుర్గం, సోమశిల డ్యామ్ లో చేపల వేటకు వెళ్లి నీటి మధ్యలో వల లాగుతుండగా జారి పడి పోయాడు అని వారితో పాటు ఉన్న వ్యక్తులు తెలిపారు. మన ఏజెన్సీ నుంచి సుమారుగా ఒక నెల క్రితం 70మంది వరకు గిరిజనులు ఊరు కానీ ఊరు పక్క జిల్లా కు జీవనోపాధి కోసం చేపల వేటకువలస వెళ్లారు, ఇక్కడ కొంతమంది మధ్యవర్తుల సహకారంతో చాలా మంది ఏజెన్సీ ప్రాంతం నుంచి చేపల వేటకు వెళ్లారు మధ్యవర్తులు,ఎవరు కూడా చనిపోయిన వ్యక్తి కోసం గాని ఎవరు పట్టించు కోవడం లేదు అని తెలిపారు, వారికీ నెల నెల జీతం కింద కొంత అమౌంట్ అడ్వాన్స్ గా తీసుకుంటారు, కుటుంబం పోషణ కోసం ఇంట్లో కొంత డబ్బులు ఇచ్చి కొంత అవసరాలు కోసం ఉంచుకుంటారు.ఇలా జీవనం గడిపే క్రమంలో ఇటువంటి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంటుంది. ఇటువంటి పరిణామాలు దృష్టిలో ఉంచుకొని ఇక నుంచి ఎవరు కూడా చేపల వేటకు గాని, ఇటుక బట్టి తయారు గాని వలస వెళ్తే ఇటువంటి పరిణామాలు చోటు చేసుకుంటాయి, అని తెలియ జేశారు, ఇటువంటి సమయంలో మధ్యావర్తులు లో ఎవరు కూడా పట్టించుకోరూ ఈ విషయం మన ఏజెన్సీ వాసులు గుర్తుంచు కోవాలి, అని గ్రామస్థులు బాధను వ్యాక్త పరిచారు. కానీ ఇక్కడ ఆనంద్ రెడ్డి, మృతదేహం ఫొటోస్ ఆధారంగా చూస్తే ఆనంద్ రెడ్డి ని కొట్టి చంపి నట్టుగా అనుమానాలు ఉన్నాయి, చనిపోయి రెండు మూడు



రోజులు కావచ్చు.అని కుటుంబం సభ్యులు తెలిపారు, డెడ్ బాడిని ఇక్కడకు తీసుకొని వచ్చి రిపోస్ట్ మటం చేయాలనీ కుటుంబం సభ్యులు కన్నీరు మున్నీరుతో భాదతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంటికి పెద్ద కొడుకు అటు తల్లిదండ్రులు ను, వారి భార్య, కొడుకును చూసుకునే దిక్కు లేదంటూ కోల్పోయామని వీలపిస్తూ.. ఇప్పుడున్న పరిస్థితిలో కుటుంబం చూసే దిక్కు లేదని,మధ్యవర్తులు మరియు చేపల పట్టించే, ఓనర్ ఇద్దరు కలిసి కుటుంబానికి నష్ట పరిహారం కింద కార్యక్రమానికి,మరియు కుటుంబం పోషణ,కు భార్య కుమారుడు కి రూ.20లక్షలు ఇవ్వాలని తెలియజేశారు.( పూర్తి వివరాలు తెలియవలసి ఉంది ) మీ పండు

## గ్రామ అభివృద్ధికి సహకరించాలి

**వొడితల ప్రణవ్ అన్నా**



**సామాన్యుడి అస్త్రం ఇల్లందకుంట:** ఇల్లందకుంట మండలం వాగొడ్డు రామన్నపల్లి గ్రామంలో ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు కారింగుల స్వప్న రాజేందర్ స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి కోసం అందరూ కలిసి సహకరించాలని హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ ని కోరారు. వొడితల ప్రణవ్ అన్నా సమక్షంలో వాగొడ్డు రామన్నపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ వార్డు మెంబర్ చింతం రఘుపతి, సీనియర్ నాయకులు తెప్ప రాంబాబు, విజయపాల్, పుట్ట అనిల్, చందు తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ప్రణవ్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందకుంట శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థాన ధర్మకర్త కారింగుల రాజేందర్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు అన్నారపు సాయి, మణి, సంతోష్, శోభన్, రాకేష్, సాయి, వంశీ తదితరులు పాల్గొన్నారు

## చిన్నకోమిటిపల్లిలో బీజేపీ విజయోత్సవం



**సామాన్యుడి అస్త్రం ఇల్లందకుంట :** గుత్తికొండ రాంబాబుకు కేంద్ర మంత్రి బండి సంజయ్ ఘన సన్మానం ఇల్లందకుంట మండలం చిన్నకోమిటిపల్లి గ్రామంలో ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసి, వార్డ్ మెంబర్‌గా ఘన విజయం సాధించిన బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ గుత్తికొండ రాంబాబును కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడంలో గుత్తికొండ రాంబాబు కీలక పాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు. ప్రజల సమస్యలపై ఎప్పుడూ స్పందిస్తూ, గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని అన్నారు. బీజేపీ ప్రభుత్వం గ్రామ స్వరాజ్యాన్ని సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని, కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రతి గ్రామానికి చేరవేయడంలో స్థానిక ప్రజాప్రతినిధులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని రాంబాబుకు అభినందనలు తెలిపారు. చిన్నకోమిటిపల్లిలో బీజేపీ బలోపేతానికి ఇది నిదర్శనమని పలువురు వ్యాఖ్యానించారు

## ఎర్రజెండా,కమ్యూనిస్టులు లేని పోరాటాలు లేవు

**అంతరాలు లేని సమసమాజ స్థాపనే లక్ష్యం**

**మంద పవన్, సీపీఐ జిల్లా కార్యదర్శి,సిద్దిపేట**

**ఘనంగా గజ్వేల్ లో సీపీఐ శత జయంతి ఉత్సవాలు..**

**సామాన్యుడి అస్త్రం గజ్వేల్** ఈ దేశంలో ఎర్రజెండా లేని,కమ్యూనిస్టులు లేని పోరాటాలు లేవని,పేదల పక్షాన నిరంతరం సీపీఐ పార్టీగా పోరాడుతామని,అంతరాలు లేని సమ సమాజ స్థాపనే లక్ష్యంగా పని చేస్తామని సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు..శుక్రవారం రోజున గజ్వేల్ కేంద్రంలో సీపీఐ 101వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని పార్టీ కార్యకర్తలు భారీ నిర్వహించారు..అనంతరం ఇందిరా గాంధీ చౌరస్తా వద్ద సీపీఐ అరుణ పతాకాన్ని మంద పవన్ ఆవిష్కరించి మాట్లాడారు..ఈ సందర్భంగా మంద పవన్ మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న సిపిఐ పార్టీ కాన్పూర్లో ఆవిర్భావం నుండి నేటి వరకు అనేక ఉద్యమాలు పోరాటాలు నిర్వహించిన ఘనత ఉందని చట్టసభల్లో కార్మికుల, కర్షకుల విద్యార్థులకు అనేక చట్టాలు చేసినటువంటి ఘనత సిపిఐ పార్టీకి ఉన్నది అన్నారు.. అదేవిధంగా దేశ స్వతంత్ర ఉద్యమంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాట నిర్వహించి అనేకమంది కమ్యూనిస్టులు వీరమరణం పొంది దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో ప్రధాన పాత్ర పోషించిందని అన్నారు..తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటలు నిర్వహించి మూడు వేల గ్రామాలను విముక్తి చేసి పది లక్షల ఎకరాల భూమిని నిరుపేదలకు పంచడం జరిగిందని గుర్తు చేశారు.. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో సిపిఐ పార్టీ కీలకపాత్ర పోషించి తెలంగాణ సాధించడంలో ముందు వరుసలో ఉందన్నారు.. బడుగు బలహీన వర్గాల కోసం, విద్యార్థులకోసం, యువత కోసం, మహిళలకోసం, నిరంతరం వారి హక్కుల కోసం,ప్రజల పక్షాన కార్మికుల కర్షకుల పక్షాన పోరాటలు



చేస్తున్నటువంటి పార్టీ సిపిఐ అన్నారు.. తాడిత, పీడిత వర్గాల అభ్యున్నతికి సీపీఐ పాటు పడుతుందని, కొంత మంది కమ్యూనిస్టు పార్టీ వ్యతిరేకులు కమ్యూనిస్ట్ పార్టీలు అంతం అయిపోతుందని మాట్లాడుతున్నారని,కానీ ప్రకృతి ఉన్నన్ని రోజులు ఎర్రజెండా ఒరగదని ఆయన అన్నారు.. సిపిఐ పార్టీకి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వచ్చే నెల జనవరి 18 నాడు ఖమ్మంలో నిర్వహించే శతయంతి ముగింపు ఉత్సవాల భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కమ్యూనిస్టు నాయకులు కార్యకర్తలు కార్మికులు కర్షకులు మేధావులు అన్ని వర్గాల ప్రజలు సానుభూతి పరులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు..ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బట్టు దయనందరెడ్డి,జేరిపోతుల జనార్ధన్,గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జి శివలింగు కృష్ణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు స్వర్గం రాజేశం, మండల సహాయ కార్యదర్శి కొండంగి పోచయ్య బొడ్ల సాయిలు మొట్ట శ్రీనుచింత శ్రీను ముట్రాజ్ పలి హమాలి కార్మిక సంఘం నాయకులు ప్రజ్ఞాపూర్ హమాలి కార్మిక సంఘంనాయకులుకంకుల కార్మిక సంఘం నాయకులు భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులుమిట్టపల్లి సుధాకర్, రామగళ్ల నరేశ్, నాయకులు నర్సింహ రెడ్డి, కానుగుల రామనకర్ మరియు మహిళలుతదితరులు పాల్గొన్నారు..

## యువజన కాంగ్రెస్ కార్యాలయంలో మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళులు



**సామాన్యుడి అస్త్రం హుజురాబాద్ :** యువజన కాంగ్రెస్ జమ్మికుంట మండల కార్యాలయంలో మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. జమ్మికుంట మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బుడిగె శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు డాక్టర్ మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ దేశం ఒక గొప్ప ఆర్థిక సంస్కర్తను కోల్పోయిందని పేర్కొన్నారు. మాజీ ఆర్థిక శాఖ మంత్రిగా, ప్రధానమంత్రిగా మన్మోహన్ సింగ్ దేశ అభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. 2004 నుంచి 2014 వరకు ప్రధానిగా పనిచేస్తూ సమాచార హక్కు చట్టం, విద్యా హక్కు చట్టం, ఆహార భద్రత చట్టం, లోక్‌పాల్ బిల్లు, జాతీయ ఉపాధి హామీ పథకం వంటి చారిత్రాత్మక చట్టాలను అమలు చేసి దేశంలో సామాజిక–ఆర్థిక మార్పులకు నాంది పలికారని గుర్తు చేశారు. క్రమశిక్షణకు, నిజాయితీకి ప్రతీకగా నిలిచిన మచ్చలేని నాయకుడు డాక్టర్ మన్మోహన్ సింగ్ అని కొనియాడారు. అనంతరం యువజన కాంగ్రెస్ జమ్మికుంట మండల కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచులు, వార్డు సభ్యులుగా ప్రజల ఆశీర్వాదంతో ఎన్నికైన యువతకు శుభాకాంక్షలు తెలిపారు. పల్లెల అభివృద్ధికి ప్రణాళికాబద్ధమైన యువ నాయకత్వాన్ని ప్రోత్సహించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లోనూ యువతకు ఇదే విధంగా మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు పార్లపల్లి నాగరాజు, దొడ్డే సంధ్యా నవీన్, జిల్లా కార్యదర్శి సజ్జద్ మహమ్మద్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శులు పంజాల అజయ్, రోమాల రాజ్‌కుమార్, మండల ఉపాధ్యక్షులు దేవనూరి వినయ్, ఆకినపల్లి శ్యామ్, మండల ప్రధాన కార్యదర్శి బిజిగిరి శ్రీకాంత్‌తో పాటు యువజన నాయకులు సూర్య, సాయి తేజ, శశి, భగవాన్ తదితరులు పాల్గొన్నారు

## ప్రాచీన కలలకు కంబాల శ్రీనివాసరావు ప్రోత్సాహం

**కోలాటం గజ్జ పూజ కార్యక్రమానికి**

**1,50,000 రూపాయలు విరాళం**



**సామాన్యుడి అస్త్రం తూర్పుగోదావరి** :,గోకవరం డ్రైవర్స్ కాలానికి చెందిన మహిళలు మన ప్రాచీన కాలం నాటి అద్భుతమైన కల "కోలాటం" నృత్యాలను నేర్చుకుంటున్నారు. బి కోలాటం నేర్చుకున్న అనంతరం గజ్జ పూజ కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి సహాయం అందించాలని డ్రైవర్ కాలనీకి చెందిన పలువురు మహిళలు విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ నాయకులు కంబాల శ్రీనివాసరావు గారి వద్దకు వచ్చి ఇటీవలే కోరారు. తక్షణమే స్పందించిన ఆయన మన ప్రాచీన కలలను ప్రోత్సహించాలని సంకల్పంతో వారికి 1,50,000 రూపాయలు విరాళం ప్రకటించారు. విరాళం చెక్ ను గోకవరం సీఎండీ కార్యాలయం వద్ద మహిళలకు అందజేశారు..

## ఇందుకూరుపేట ఎయిడెడ్ స్కూల్ మరమ్మత్తులకు కంబాల 50,000 రూపాయలు సహాయం...






**సామాన్యుడి అస్త్రం అల్లూరి :** రంపచోడవరం నియోజకవర్గం, దేవీపట్నం మండలం, ఇందుకూరుపేట గ్రామంలోని ఎయిడెడ్ స్కూల్ లో 20 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.బి స్కూల్ పైకప్పు పాడైపోయి విద్యార్థులు చదువుకోడానికి పలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని పాఠశాల టీచర్ కడిమి రాంబాబు విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ నాయకులు కంబాల శ్రీనివాసరావు గారి దృష్టికి తీసుకువచ్చి మరమ్మత్తుకు సహాయం చేయాలని కోరగా స్పందించిన ఆయన లి తన వంతు సహాయంగా పాఠశాల మరమ్మతులకు 50,000 రూపాయలు సహాయాన్ని గోకవరం సీఎండీ కార్యాలయం వద్ద పాఠశాల టీచర్ కి అందజేశారు

## గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కైవసమే బిజెపి ఎజెండా

**పట్టణ ప్రజలు బిజెపి నే ఆదరిస్తారు**

**బిఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీలు ప్రజల విశ్వాసం కోల్పోయాయి**




**సామాన్యుడి అస్త్రం** గజ్వేల్ పట్టణంలో స్థానిక ప్రజ్ఞా గార్డెన్లో మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు ఆదేశాల మేరకు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ బిజెపి అధ్యక్షులు దేవులపల్లి మనోహర్ యాదవ్ అధ్యక్షతన ముఖ్యఅతిథిగా బిజెపి జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్ తో బిజెపి గజ్వేల్ పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్, గజ్వేల్ మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, బిజెపి సీనియర్ నాయకులు యెల్లు రాం రెడ్డి గాళ్లు మాట్లాడుతూ గజ్వేల్ పట్టణంలో ఉన్న పెండింగ్ సమస్యల పరిష్కారానికై మరియు గజ్వేల్ పట్టణ అభివృద్ధి లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ పనిచేస్తుందన్నారు త్వరలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు అదేవిధంగా బిజెపి రాష్ట్ర నేతల పర్యటన ఉంటుందన్నారు ప్రతి వార్డులో బిజెపి జెండా ఎగరవేస్తూ వార్డు వార్డు ప్రజలను కలుస్తూ ప్రతి వార్డులో బిజెపి జండా ఎగరవేయడమే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు అదేవిధంగా ఆర్ అండ్ ఆర్ కాలనీ లో ఉన్న ప్రధాన సమస్యలను పరిష్కారానికై కృషి చేస్తూ బిజెపి బలోపేతానికి ఆర్ అండ్ ఆర్ కాలనీ కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు గజ్వేల్ పట్టణంలో పెండింగ్ పనులను పూర్తిచేయడంలో బిఆర్ఎస్ పార్టీ విఫలమైంది కాంగ్రెస్ పార్టీ కేవలం గ్రూప్ కుమ్మలాటలతోనే కాలం గడుపుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు పేర్ల శ్రీనివాస్, కుడిక్యాల రాములు, ఉప్పల మధు, కమ్మరి శ్రీను, నత్తి శివకుమార్, చెప్యాల వెంకటరెడ్డి, నాగు ముదిరాజ్, మాజీ కౌన్సిలర్లు సుభాష్ చంద్రబోస్, రామచంద్ర చారి, గజ్వేల్ పట్టణ ప్రధాన కార్యదర్శిలు నాయిని సందీప్ కుమార్, మాడుగురి నరసింహా ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## కవి జోగు అంజయ్య మాతృమూర్తి మృతి

**: పరమర్శించిన కవులు కళాకారులు**



**సామాన్యుడి అస్త్రం జనగామ** జరసం వ్యవస్థాపకుల్లో ఒకరు, కవి జోగు అంజయ్య మాతృమూర్తి, వడ్డిచర్ల గ్రామ మొదటి సర్పంచ్ జోగు రాజయ్య సతీమణి జోగు రాజమ్మ ఇటీవల మృతి చెందారు. ఈ నేపధ్యంలో శుక్రవారం లింగాలఘనపురం మండలం వడ్డిచర్ల గ్రామంలో అంజయ్యను కవులు కళాకారులు పరామర్శించారు. ఈ సందర్భంగా రాజమ్మకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జనగామ కవులు కళాకారుల ఐక్యవేదిక భాగస్వామ్య సాహితి సంస్థలు జి.వై.గిరి పౌండేషన్ జి.కృష్ణ, కవి హృదయం సాహిత్య వేదిక పెట్లోజు సోమేశ్వరా చారి, అభినందన కల్చరల్ సోసైటీ అయిలా సోమనర్సింహచారి, వర్కింగ్ కమిటీ మెంబర్ తాళ్లపల్లి లక్ష్మణ్ గౌడ్, గొలుసుల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



# కూరలో ఉప్పు ఎక్కువ పడిందా?

ఆహార రుచిని పెంచడంలో ఉప్పు పాత్ర మెజారిటీ వంతు ఉంటుంది. ఉప్పు అస్సలు లేకపోయినా.. కొంచెం ఎక్కువ ఉప్పు ఉన్నా ఆహారం రుచి చెడిపోతుంది. ఎక్కువ ఉప్పు ఉన్నప్పుడు చాలా మంది తాము చేసిన కష్టమంతా వృధా అయిందని భావించి ఆహారాన్ని చెత్తలో పడేస్తుంటారు. ఆహార రుచిని పెంచడంలో ఉప్పు పాత్ర మెజారిటీ వంతు ఉంటుంది. ఉప్పు అస్సలు లేకపోయినా.. కొంచెం ఎక్కువ ఉప్పు ఉన్నా ఆహారం రుచి చెడిపోతుంది. ఎక్కువ ఉప్పు ఉన్నప్పుడు చాలా మంది తాము చేసిన కష్టమంతా వృధా అయిందని భావించి ఆహారాన్ని చెత్తలో పడేస్తుంటారు. ఆహారంలో ఎక్కువ ఉప్పు ఉంటే ఆందోళన గురికావలసిన అవసరం లేదు. ఈ కింది కొన్ని చిట్కాలను అనుసరించడం ద్వారా మీ వంట రుచిని సర్దుబాటు చేసుకోవచ్చు. ఎక్కువ ఉప్పు వల్ల వంటకం రుచి చెడిపోతే రుచిని సమతుల్యం చేయడానికి మీరు వంటకంలో పెరుగు వేయవచ్చు. వంటకంలో రెండు టేబుల్ స్పూన్ల పెరుగు వేసి రెండు నిమిషాలు ఉడికించాలి. ఇది ఉప్పు శాతాన్ని సమతుల్యం చేస్తుంది. ఇలా చేయడం వల్ల వంటకం రుచి కూడా మెరుగుపరుస్తుంది. మీరు వేయించిన శనగ పిండిని కూడా ఉపయోగించవచ్చు. మీ వంటకంలో పొరబాటున ఉప్పు ఎక్కువ పడితే వేయించిన శనగ పిండిని జోడించవచ్చు. ఇది అదనపు ఉప్పును సమతుల్యం చేస్తుంది. వంటకం రుచిని మెరుగుపరుస్తుంది. ఉడికించిన బంగాళాదుంపలను ఉపయోగించడం ద్వారా వంటలో ఉప్పదనాన్ని గరిష్ఠంగా తగ్గించవచ్చు. ఉప్పు ఎక్కువగా ఉంటే ఉడికించిన బంగాళాదుంపలను కోసి మీరు తయారుచేసిన వంటకంలో వేసి బాగా కలపాలి. ఇది ఉప్పును గ్రహిస్తుంది. మీరు వంటలో పచ్చి బంగాళాదుంప ముక్కలను కూడా ఇందులో వేయవచ్చు. వంటలో ఉప్పు శాతాన్ని సమతుల్యం చేయడంలో నిమ్మరసం కూడా సహాయపడుతుంది. ఉప్పు శాతం ఎక్కువగా ఉంటే వంటకంలో సగం నిమ్మకాయ రసం పిండి బాగా కలపాలి. ఇది అదనపు ఉప్పు శాతాన్ని సమతుల్యం చేస్తుంది. గ్రేవీ చాలా ఉప్పగా ఉంటే మీరు దానికి కొబ్బరి పాలు జోడించవచ్చు. మీరు కొబ్బరి పాలతో కొద్దిగా నీరు కలిపి గ్రేవీలో కలపవచ్చు. ఇది వంటకం రుచిని పెంచుతుంది. ఇలా చేయడం వల్ల అదనపు ఉప్పును సమతుల్యం చేస్తుంది. వంట ఉప్పగా అనిపిస్తే అందులో కొద్దిగా చక్కెర లేదా బెల్లం కలపాలి. చక్కెర తీపి ఉప్పు మొత్తాన్ని సమతుల్యం చేయడానికి సహాయపడుతుంది.

# చలికాలంలో ఐస్ క్రీమ్ తింటే ఏమవుతుంది?



ఐస్ క్రీమ్ అంటే ఎవరికీ ఇష్టం ఉండదు. టైమ్‌తో సంబంధం లేకుండా చాలా మంది ఎప్పుడు పడితే అప్పుడు ఇష్టంగా తింటారు. చాలా మంది చలికాలంలో ఐస్ క్రీమ్ తింటుంటారు. అసలు చలికాలంలో ఐస్ క్రీం తింటే నిజంగా జలుబు చేస్తుందా? బయట చలి చంపేస్తున్నా.. ఐస్ క్రీం పార్లర్ల దగ్గర జనం తగ్గరు. కొందరికి ఐస్ క్రీం తినడానికి సీజన్‌తో సంబంధం ఉండదు. అయితే చలికాలంలో ఐస్ క్రీం తింటే జలుబు, దగ్గు వస్తుంది అని ఇంట్లో పెద్దలు హెచ్చరిస్తుంటారు. ఇంతకీ ఈ మాటలో నిజమెంత..? వింటర్‌లో చల్లని ఆహారాలు తీసుకోవడం ఆరోగ్యానికి హానికరమా..? నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఐస్ క్రీం తినడం వల్ల నేరుగా జలుబు రాదు. జలుబు, ఫ్లూ వంటివి వైరస్‌లు లేదా బ్యాక్టీరియా వల్ల వస్తాయి కానీ, చల్లని ఉష్ణోగ్రత వల్ల కాదు. చల్లని ఆహారం కడుపులోకి వెళ్లిన వెంటనే, మన శరీరంలోని అంతర్గత వ్యవస్థ దానిని వేడి చేయడానికి ప్రయత్నిస్తుంది. కాబట్టి శరీర ఉష్ణోగ్రత అకస్మాత్తుగా పడిపోదు. ఐస్ క్రీం ఒత్తిడిని తగ్గించి, మానసిక స్థితిని ఉల్లాసంగా ఉంచే ఆహారం. అందుకే చాలామంది చలిలో కూడా దీనిని ఇష్టపడతారు. ఆరోగ్యంగా ఉన్నవారు ఐస్ క్రీం తింటే పెద్దగా ఇబ్బంది లేకపోయినా కొన్ని సమస్యలు ఉన్నవారు మాత్రం దూరంగా ఉండటం మంచిది. గొంతు సమస్యలు: ఇప్పటికే గొంతు నొప్పి లేదా ఇన్‌ఫెక్షన్ ఉన్నవారికి చల్లని ఐస్ క్రీం ఆ అసౌకర్యాన్ని మరింత పెంచుతుంది. అస్తమా, దగ్గు ఉన్నవారు: శ్వాసకోశ సమస్యలు లేదా తరచుగా దగ్గు వచ్చే వారికి చల్లని, చక్కెర కలిగిన ఆహారాలు కఫం ఉత్పత్తిని పెంచే అవకాశం ఉంది. తేమ లేకపోవడం: చలికాలంలో గాలిలో తేమ తక్కువగా ఉంటుంది. ఐస్ క్రీం తినడం వల్ల గొంతు లోపలి భాగం మరింత పొడిబారి, వైరల్ ఇన్‌ఫెక్షన్లకు దారితీయవచ్చు. ఐస్ క్రీంను గబగబా తినకుండా, చిన్న స్పూన్లతో నిదానంగా తినండి. దీనివల్ల నోటి ఉష్ణోగ్రత అకస్మాత్తుగా తగ్గదు. ఐస్ క్రీం తిన్న తర్వాత గ్లాసు గోరువెచ్చని నీరు లేదా పాలు తాగడం వల్ల గొంతు సాధారణ స్థితికి వస్తుంది. మీకు కొంచెం జలుబుగా అనిపించినా ఆ సమయంలో ఐస్ క్రీంకు దూరంగా ఉండటమే ఉత్తమం. మొత్తానికి చలికాలంలో ఆరోగ్యంగా ఉన్నవారు ఐస్ క్రీం తినడం సురక్షితమే. అయితే అది మితంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. అతి సర్వత్ర వర్జయేత్ అన్నట్లు.. పరిమితి దాటితే ఏదైనా ప్రమాదమే.


## గంటల కొద్దీ జిమ్‌లో కష్టపడక్కర్లేదు!

# రోజూ ఇలా నడిస్తే చాలు!



నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టడం అందరికీ సవాలుగా మారింది. ముఖ్యంగా బరువు తగ్గాలని, పొట్ట చుట్టూ పేరుకుపోయిన కొవ్వును కరిగించాలని చాలామంది జిమ్‌లకు వెళ్లి గంటల కొద్దీ కష్టపడుతుంటారు. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టడం అందరికీ సవాలుగా మారింది. ముఖ్యంగా బరువు తగ్గాలని, పొట్ట చుట్టూ పేరుకుపోయిన కొవ్వును కరిగించాలని చాలామంది జిమ్‌లకు వెళ్లి గంటల కొద్దీ కష్టపడుతుంటారు. అయితే, ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా 'పిరమిడ్ వాకింగ్' అనే సరికొత్త ట్రెండ్ బాగా ప్రాచుర్యం పొందుతోంది. సాధారణ నడక కంటే ఎంతో ప్రభావవంతంగా పనిచేసే ఈ పద్ధతి ద్వారా తక్కువ సమయంలోనే అద్భుతమైన ఫలితాలను సాధించవచ్చని నిపుణులు చెబుతున్నారు. పిరమిడ్ వాకింగ్ అనేది ఒక రకమైన ఇంటర్వెల్ ట్రైనింగ్ వంటిది. ఇందులో నడక వేగాన్ని పిరమిడ్ ఆకారంలో క్రమక్రమంగా పెంచుతూ, మళ్ళీ తగ్గించడం జరుగుతుంది. ఉదాహరణకు, మొదట మూడు నిమిషాలు చాలా నెమ్మదిగా నడవాలి. ఆ తర్వాత మరో మూడు నిమిషాలు మధ్యస్థ వేగంతో, ఆ తదుపరి మూడు నిమిషాలు అత్యంత వేగంగా (బ్రిస్క్ వాకింగ్) నడవాలి. ఇలా వేగాన్ని పెంచిన తర్వాత, మళ్ళీ అదే క్రమంలో వేగాన్ని తగ్గిస్తూ రావాలి. అంటే వేగంగా ఉన్న నడకను మధ్యస్థానికి, ఆపై నెమ్మదిగా నడవడానికి మార్చాలి. ఇలా చేయడం వల్ల గుండె వేగం ఒకేలా కాకుండా మారుతూ ఉండటం వల్ల శరీరంలో జీవక్రియలు మెరుగుపడతాయి. ఈ పద్ధతి వల్ల కలిగే ప్రధాన లాభం ఏమిటంటే.. ఇది రక్త ప్రసరణను అద్భుతంగా మెరుగుపరుస్తుంది. శరీరంలోని ప్రతి భాగానికి ఆక్సిజన్ సరఫరా పెరగడం వల్ల కండరాలు బలోపేతం అవుతాయి. ముఖ్యంగా బెల్లీ ఫ్యాట్ అంటే పొట్ట దగ్గర ఉన్న మొండి కొవ్వును కరిగించడానికి ఈ నడక ఎంతో సహాయపడుతుంది. సాధారణ నడకలో మనం ఒకే వేగాన్ని పాటిస్తాం, దీనివల్ల శరీరం దానికి అలవాటు పడిపోతుంది. కానీ పిరమిడ్ వాకింగ్‌లో వేగం మారుతూ ఉండటం వల్ల శరీరం ఎక్కువ క్యాలరీలను ఖర్చు చేయాల్సి ఉంటుంది. దీనివల్ల బరువు తగ్గడం సులభతరమవుతుంది. డయాబెటిస్, రక్తపోటు వంటి సమస్యలతో బాధపడేవారికి కూడా ఈ పిరమిడ్ వాకింగ్ ఒక వరమనే చెప్పాలి. ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా, శరీరంలోని చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతుంది. మానసిక ఒత్తిడిని తగ్గించి, రోజంతా ఉత్సాహంగా ఉండేలా చేస్తుంది. దీనికోసం ప్రత్యేకమైన పరికరాలు లేదా జిమ్ సభ్యత్వాలు అవసరం లేదు. ప్రతిరోజూ ఉదయం లేదా సాయంత్రం మీ ఇంటి ఆవరణలో లేదా పార్కులో కేవలం 15 నుండి 20 నిమిషాల పాటు ఈ పద్ధతిని పాటిస్తే సరిపోతుంది. ఆరోగ్యంగా ఉండాలనుకునే వారికి ఇది ఒక సింపుల్ అండ్ బెస్ట్ ఛాయిస్.

# శీతాకాలంలో లభించే చవకైన పండు



పండ్లలో ఎన్నో పోషకాలు దాగున్నాయి.. వీటిని తింటే ఆరోగ్యంగా ఉండవచ్చు.. ముఖ్యంగా.. శీతాకాలంలో లభించే పండ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని.. వీటిని డైలీ తినాలని సూచిస్తున్నారు ఆరోగ్య నిపుణులు.. అలాంటి పండ్లలో జామకాయ ఒకటి.. శీతాకాలంలో జామ పండు తినడం మంచిది.. పండ్లలో ఎన్నో పోషకాలు దాగున్నాయి.. వీటిని తింటే ఆరోగ్యంగా ఉండవచ్చు.. ముఖ్యంగా.. శీతాకాలంలో లభించే పండ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి.. అలాంటి పండ్లలో జామకాయ ఒకటి.. శీతాకాలంలో జామ పండు తినడం మంచిది.. ఎందుకంటే ఇందులో ప్రోటీన్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. ఈ పండులో విటమిన్ సి, ఫైబర్ కూడా పుష్కలంగా ఉంటాయి. జామ పండులో అరటిపండు కంటే ఎక్కువ పొటాషియం, 5 గ్రాముల ఫైబర్, 3 గ్రాముల ప్రోటీన్ ఉంటాయి. ఈ పండు సాధారణంగా ప్రతిచోటా లభిస్తుంది.. అన్ని సీజన్లలో జామపండ్లు లభిస్తున్నప్పటికీ.. శీతాకాలంలో ఎక్కువగా లభిస్తాయి.. అంతేకాకుండా చౌకగా కూడా ఉంటాయి.. సాధారణంగా ఒక జామకాయ రూ.5 లేదా 10 కి లభిస్తుంది.. ఇంకా కేజీ రూ.50 వరకు లభిస్తాయి.. అయితే.. నాణ్యతను బట్టి కూడా ధర ఉంటుంది. శీతాకాలంలో అన్ని ప్రాంతాల్లో జామపండ్లు లభిస్తాయి. జామ పండు తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. ఇందులోని యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతాయి. జామ ఆకులు ఇన్సులిన్ నిరోధకతను మెరుగుపరుస్తాయి. జామ ఆకుల టీ తాగడం వల్ల మధుమేహ వ్యాధిగ్రస్తులలో భోజనం తర్వాత చక్కెర స్థాయిలు 10 శాతం తగ్గుతాయని నిపుణులు చెబుతున్నారు.ఇంకా జామపండ్లు గుండె ఆరోగ్యానికి తోడ్పడతాయి. యాంటీఆక్సిడెంట్లు గుండెను ఫ్రీ రాడికల్ నష్టం నుండి రక్షిస్తాయి.జామపండ్లు కొలెస్ట్రాల్, రక్తపోటును కూడా తగ్గిస్తాయి. వీటిలోని ఫైబర్ కంటెంట్.. బరువును తగ్గేలా చేస్తుంది.జామపండ్లు ముఖ్యంగా ఆరోగ్యకరమైన జీర్ణక్రియ, ప్రేగు కదలికలను ప్రోత్సహిస్తాయి. ఈ పండులోని ఫైబర్ మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. ఇంకా కడుపును ఆరోగ్యవంతంగా ఉంచుతుంది. జామపండును ఎలాగైనా తినొచ్చు.. అల్పాహారంగా లేదా భోజనం తర్వాత జామపండును తినవచ్చు.. ఇంకా స్నాక్స్ రూపంలో కూడా తీసుకోవచ్చు.. ఇంకా జ్యూస్ చేసుకుని కూడా తాగొచ్చు..

# రణ్‌వీర్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్.. రూ. 1000 కోట్ల క్లబ్‌లో చేరిన 'ధురంధర్'!

బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ నటించిన 'ధురంధర్' బాక్సాఫీస్ వద్ద చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. తాజాగా ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ. 1000 కోట్ల క్లబ్‌లో చేరి భారతీయ సినిమా రికార్డులను తిరగరాసింది. విడుదలైన కేవలం 21 రోజుల్లోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ. 1006.7 కోట్ల (గ్రాస్) వసూళ్లను సాధించినట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. ఇప్పటివరకు ఇండియాలో రూ. 789.18 కోట్ల గ్రాస్ (రూ. 633.5 కోట్ల నెట్) వసూళ్లు రాబట్టిన ఈ చిత్రం ఓవర్సీస్ మార్కెట్‌లో రూ. 217.5 కోట్ల మార్కును దాటి దూసుకుపోతోంది. దీంతో అత్యధిక వసూళ్లు సాధించిన మొదటి 10 భారతీయ చిత్రాల జాబితాలో 'ధురంధర్' 9వ స్థానంలో నిలిచింది. అలాగే రణబీర్ కపూర్ 'యానిమల్' రికార్డులను ఈ చిత్రం అధిగమించింది. 'ఉరి' వంటి సెన్సేషనల్ హిట్ ఇచ్చిన ఆదిత్య ధర్ ఈ సినిమాకు దర్శకత్వం వహించగా.. రణ్‌వీర్ సింగ్‌తో పాటు సంజయ్ దత్, అక్షయ్ ఖన్నా, మాధవన్ వంటి దిగ్గజ నటులు ఈ చిత్రంలో కీలక పాత్రల్లో నటించారు. 1999 కాందహార్ విమానం హైజాక్, 2001 పార్లమెంట్ దాడి వంటి యదార్థ సంఘటనల ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కింది. మరోవైపు ఈ సినిమా సీక్వెల్ వచ్చే ఏడాది మార్చి 19న ఈద్ కానుకగా విడుదల కాబోతుంది. మొదటి భాగం కేవలం హిందీలోనే సంచలనం సృష్టించగా, రెండో భాగాన్ని తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో భారీగా విడుదల చేయనున్నారు.






## బాక్సాఫీస్ దగ్గర దుమ్మురేపుతున్న 'ఛాంపియన్' .. కెరీర్ బెస్ట్ ఓపెనింగ్స్‌తో రోషన్‌కి సాలిడ్ హిట్

యంగ్ హీరో రోషన్ మేక నటించిన తాజా చిత్రం 'ఛాంపియన్' థియేటర్లలో సూపర్ జోష్‌తో దూసుకెళ్తోంది. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమా నిన్న ప్రేక్షకుల ముందుకు రాగా, ఫస్ట్ షో నుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. దీంతో బాక్సాఫీస్ వద్ద 'ఛాంపియన్' కలెక్షన్స్ స్ట్రాంగ్‌గా నమోదు అవుతున్నాయి. ముఖ్యంగా రోషన్ కెరీర్‌లోనే ఈ సినిమాకు బెస్ట్ ఓపెనింగ్స్ రావడం విశేషంగా మారింది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, కేవలం నైజాం ఏరియాలోనే రూ. 2 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసింది. ఇక వరల్డ్ వైడ్ ఫస్ట్ డే కలెక్షన్స్ దాదాపు రూ. 4.5 కోట్ల గ్రాస్ వరకు చేరి అందరిని ఆశ్చర్యపరిచింది. రోషన్ గత చిత్రాలతో పోలిస్తే ఇదే అతడి కెరీర్‌లో అత్యధిక ఓపెనింగ్ రికార్డ్‌గా నిలిచింది. ఈ సినిమాకు స్వప్న సినిమాస్ వంటి పెద్ద బ్యానర్ సపోర్ట్, దర్శకుడు ప్రదీప్ అద్వైతం అందించిన పవర్‌ఫుల్ టేకింగ్ ప్రధాన బలాలుగా నిలిచాయి. అలాగే మలయాళ బ్యూటీ అనస్వరా రాజన్ నటనకు ప్రేక్షకుల నుంచి మంచి ప్రశంసలు లభిస్తున్నాయి. కథ, యాక్షన్ సీక్వెన్సులు, ఎమోషనల్ ఎలిమెంట్స్ సమతుల్యంగా ఉండటంతో సినిమా చూసినవాళ్లు బాగుందని చెప్పడం వల్ల వర్డ్ ఆఫ్ మౌత్ బలంగా స్ప్రెడ్ అవుతోంది. సోషల్ మీడియాలో కూడా 'ఛాంపియన్'కు పాజిటివ్ బజ్ కొనసాగుతోంది. రివ్యూలు అనుకూలంగా రావడంతో టికెట్ బుకింగ్స్ వేగంగా పెరుగుతున్నాయి. ఈ ప్రభావంతో వీకెండ్ కలెక్షన్స్ మరింత పెరిగే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. సంగీత దర్శకుడు మిక్కీ జె మేయర్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకి మరింత ఎనర్జీని అందించగా, మురళీ శర్మ, సంతోష్ ప్రతాప్ వంటి నటుల పర్ఫార్మెన్స్‌లు కథకు అదనపు బలం చేకూర్చాయి. మొత్తం మీద 'ఛాంపియన్' సినిమా రోషన్ మేక కెరీర్‌లో ఒక కీలక మైలురాయిగా నిలుస్తూ, బాక్సాఫీస్ వద్ద జెట్ స్పీడ్‌లా దూసుకెళుతుంది. ఇదే జోష్ కొనసాగితే ఈ చిత్రం రోషన్‌కు సాలిడ్ హిట్‌గా నిలవడం ఖాయమని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన నితీశ్ కుమార్ రెడ్డి

స్పోర్ట్స్

ఐపీఎల్ 2026కి ముందు సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు శుభవార్త అందింది. స్టార్ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి ఫామ్‌లోకి వచ్చాడు. విజయ్ హజారే ట్రోఫీ 2025-26లో భాగంగా రైల్వేస్‌తో ఇవాళ (డిసెంబర్ 26) జరిగిన మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టాడు. ఫలితంగా అతని జట్టు ఆంధ్రప్రదేశ్ 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. పూర్తి వివరాల్లోకి వెళితే.. అలూర్ వేదికగా ఆంధ్ర, రైల్వేస్ జట్లు పోటీపడ్డాయి. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఆంధ్ర జట్టు ప్రత్యర్థిని 266 పరుగులకే (9 వికెట్ల నష్టానికి) కట్టడి చేసింది. సత్యనారాయణ రాజు (10-1-41-3), కేఎస్ నరసింహ రాజు (10-0-68-3), హేమంత్ రెడ్డి (6-0-34-2), నితీశ్ కుమార్ రెడ్డి (10-0-34-1) అద్భుతంగా బౌలింగ్ చేసి రైల్వేస్‌కు భారీ స్కోర్ చేయనివ్వలేదు. అయినా ఆన్ష్ యాదవ్ (59), రవి సింగ్ (76) అర్ధ సెంచరీలతో పోరాడటంతో రైల్వేస్ ఓ మోస్తరుకు మించిన స్కోర్ అయితే చేయగలిగింది. ఆ జట్టు తరఫున జుబైర్ అలీ (48), రాజ్ చౌదరి (22 నాటౌట్) కూడా పోరాడారు. మిగతా బ్యాటర్లలలో సూరజ్ అహూజా 7, ప్రథమ్ సింగ్ 6, ఉపేంద్ర యాదవ్ 7, అశుతోష్ శర్మ 8, కర్ణ్ శర్మ 7, రాహుల్ శర్మ 12 పరుగులు చేశారు. అనంతరం 267 పరుగుల లక్ష్య ఛేదనలో ఆంధ్ర సునాయాస విజయం సాధించింది. బంతితో రాణించిన నితీశ్ కుమార్ రెడ్డి, హేమంత్ రెడ్డి బ్యాట్‌తో కూడా సత్తా చాటారు. నితీశ్ 41 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో అజేయమైన 55 పరుగులు చేయగా.. హేమంత్ 35 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్ల సాయంతో అజేయమైన 41 పరుగులు చేసి జట్టును విజయతీరాలకు చేర్చారు. వీరికి ముందు రికీ భుయ్ (76) బాధ్యతాయుతమైన అర్ధ సెంచరీ చేసి గెలుపుకు పునాది వేశాడు. ఓపెనర్లు అశ్విన్ హెబ్బర్ (30), శ్రీకర్ భరత్ (25), వన్‌డౌన్ బ్యాటర్ షేక్ రషీద్ (40) పర్వాలేదనిపించారు. జట్టులో ప్రతి ఒక్కరు తలో చేయి వేయడంతో ఆంధ్ర జట్టు 44.4 ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి విజయతీరాలకు చేరింది.




## ఫీల్డింగ్ చేస్తూ గాయపడిన ఐపీఎల్ స్టార్.. స్ట్రెచర్ మీద ఆస్పత్రికి తరలింపు..!

ఐపీఎల్‌లో మెరుపు ఇన్నింగ్స్‌లతో అలరించే అంగ్‌క్రిష్ రఘువంశీ అనుకోకుండా ఆస్పత్రి పాలయ్యాడు. దేశవాళీ టోర్నీలో ఆడుతూ గాయపడడంతో అతడిని దవాఖానకు తీసుకెళ్లారు. విజయ్ హజారే ట్రోఫీలో ముంబై తరఫున బరిలోకి దిగిన అంగ్‌క్రిష్ శుక్రవారం ఉత్తరాఖండ్‌తో మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తుండగా గాయపడ్డాడు. నడలేని స్థితిలో ఉన్న అతడిని స్ట్రెచర్ మీద బయటకు తీసుకొచ్చి.. సమీపంలోని ఎస్‌డీఎంహెచ్ ఆస్పత్రిలో చేర్పించారు. వన్డే ఫార్మాట్‌లో జరుగుతున్న విజయ్ హజారే ట్రోఫీలో ముంబైకి అంగ్‌క్రిష్ రఘువంశీ ఆడుతున్నాడు. జైపూర్‌లో శుక్రవారం ఉత్తరాఖండ్‌పై 11 పరుగులతో నిరాశపరిచిన అతడు.. ఫీల్డింగ్‌లో కష్టమైన క్యాచ్ అందుకునే క్రమంలో గాయపడ్డాడు. ఎలాగైనా బంతిని ఒడిసిపట్టేందుకు ప్రయత్నించిన ఈ యువకెరటం తల, భుజాలకు గాయాలయ్యాయి. దాంతో.. నొప్పితో మైదానంలోనే కూలబడిన అతడిని ఫిజియో వచ్చి పరీక్షించాడు. అయినా పరిస్థితి మెరుగవ్వకపోవడంతో సిబ్బంది స్ట్రెచర్ మీద అంగ్‌క్రిష్‌ను బయటకు తీసుకెళ్లారు. అనంతరం.. ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగా ఉందని సమాచారం. ఐపీఎల్‌లో



కోల్‌కతా నైట్ రైడర్స్ బ్యాటింగ్ అస్త్రంగా పేరొందిన అంగ్‌క్రిష్ టాపార్డర్ బ్యాటర్. ఇప్పటివరకూ రెండు సీజన్లలో 22 మ్యాచులు ఆడిన ఈ చిచ్చరపిడుగు 463 పరుగులు సాధించాడు.

## కోహ్లీ ఖాతాలో మరో మైలురాయి.. ఆస్ట్రేలియా దిగ్గజం 'ఆల్‌టైమ్ రికార్డు' గల్లంతు..!



వన్డే ఫార్మాట్లో రారాజుగా వెలుగొందుతున్న విరాట్ కోహ్లీ వరుసగా రికార్డులను బ్రేక్ చేస్తున్నాడు. సిడ్నీ వన్డేలో అర్ధ శతకంతో మొదలైన విరాట్ పరుగుల ప్రవాహం అవిఘ్నంగా కొనసాగుతోంది. బీసీసీఐ కోరిక మేరకు విజయ్ హజారే ట్రోఫీలోనూ ఆడుతున్న కింగ్ కోహ్లీ.. అక్కడా రికార్డుల దుమ్ముదులుపుతున్నాడు. తొలి మ్యాచ్‌లోనే శతకంతో రెచ్చిపోయిన భారత స్టార్.. గుజరాత్‌పై అర్ధ శతకంతో మరో రికార్డు పట్టేశాడు. లిస్ట్ %-% ఏ క్రికెట్‌లో అత్యధిక సగటు నమోదు చేశాడు. ఇటీవల కాలంలో సూపర్ ఫామ్ కొనసాగిస్తున్న కోహ్లీ విజయ్ హజారే ట్రోఫీతో తడాఖా చూపిస్తున్నాడు. వచ్చే ప్రపంచకప్ లక్ష్యంగా పదిహేనేళ్ల తర్వాత ఈ లీగ్‌లో ఆడుతున్న అతడు.. విధ్వంసక ఆటతో అందర్నీ ఫిదా చేస్తున్నాడు. శుక్రవారం గుజరాత్‌పై హాఫ్ సెంచరీతో కదం తొక్కిన విరాట్ మళ్లీ వంద కొట్టేలా కనిపించాడు. కానీ, 77 పరుగుల వద్ద వెనుదిరిగాడు. అయినా సరే.. అత్యధిక సగటుతో ఆస్ట్రేలియా మాజీ ఫినిషర్ మైఖేల్ బెవాన్ పేరిట ఉన్న ఆల్‌టైమ్ రికార్డును దాటేశాడు. 'నాటౌట్ కింగ్'గా పేరొందిన బెవాన్ సగటు లిస్ట్ ఏ క్రికెట్‌లో 57.86 కాగా.. కోహ్లీ 57.87తో అతడిని అధిగమించాడు. లిస్ట్ ఏలో సచిన్ టెండూల్కర్ రికార్డును బద్దలు కొడుతూ అత్యల్ప మ్యాచుల్లోనే 16 వేల క్లబ్‌లో చేరాడు విరాట్. ప్రస్తుతం 343 మ్యాచుల్లో 57.60 సగటుతో 16,130 రన్స్ బాదాడు. ఇందులో 58 సెంచరీలు, 84 అర్ధ శతకాలు ఉన్నాయి.

PRINTED AND PUBLISHED BY PANUTULA PRIYANKA, ON BEHALF OF PANUTULA PRIYANKA, PRINTED AT M/S.PARAHUSHAR PRINTING PUBLICATION, 1-4-36, SRINAGAR COLONY, MAHABUBABAD, WARANGAL TELANGANA -506101.AND PUBLISHED AT #H.NO.12-155, RAVINDER REDDY COMPLEX, NEAR HANUMANTEMPLE, IDA BOLLARAM MUNICIPALITY, JINNARAM MANDAL, SANGAREDDY DIST - 502325, TELANGANA STATE. EDITOR: PANUTULA PRIYANKA. RNI NO: TGTEL/25/A1872, Email: mathrubhoomiceo@gmail.com, Phone: 9182698313.